


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 189 | బుధవారం 15- 07 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ:





# బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలు

**ఆర్టీజీఎస్ సమీక్షలో దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు**

- క్రౌడ్ సోర్సింగ్ ద్వారా ఫిర్యాదుల సమాచారం
- ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి ఆలస్యం కాకూడదు
- అవకాశాలు అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు
- 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 20 శాతం వృద్ధి నమోదు

మిగతా2లో

ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ రీ డ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సీఎం నిర్దేశించారు. సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దేవాదాయ, రహదారులు భవనాలు, ఏపీఎస్ఆర్టీసీ, రవాణా,అగ్నిమాపక, వ్యవసాయ శాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న సంతృప్త స్థాయిపై సీఎం సూచనలు జారీ చేశారు. ప్రోయాక్టివ్ గవర్నెన్సు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకూ పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు

- మత్స్యకార మృతుల కుటుంబాలను పరామర్శించిన జగన్
- మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదని ఆగ్రహం

2లో



## జగన్ శవ రాజకీయాలు మానాలి

- జగన్ విశాఖ పర్యటనపై పల్లా విమర్శలు
- వైసీపీ హయాంలో మత్స్యకారులకు జగన్ ఎలాంటి న్యాయం చేయలేదని విమర్శ
- రాజకీయ లాభం కోసమే జగన్ విశాఖకు వస్తున్నారని మండిపాటు

2లో



# రాయలసీమలో రూ.3,100 కోట్ల పెట్టుబడి..

**700 మందికి ఉద్యోగాలు..**



- కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ విస్తరణకు రంగం సిద్ధం
- రూ.3,100 కోట్ల భారీ పెట్టుబడితో రెండో ప్లాంట్ నిర్మాణం
- రేపు పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి నారా లోకేశ్
- కొత్తగా 700 మందికి ఉద్యోగాలు, ప్రభుత్వానికి ఏటా రూ.325 కోట్ల ఆదాయం
- పర్యావరణ హితంగా గ్రీన్ ఇండస్ట్రీ ప్రమాణాలతో ప్లాంట్ నిర్మాణం

మిగతా2లో

ప్రజా ప్రభుత్వ పాలనలో రాయలసీమ పారిశ్రామిక ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ముఖ్యంగా కడప జిల్లాలో పెట్టుబడుల వెల్లువ కనిపిస్తోంది. ఇప్పటికే సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ వంటి కీలక ప్రాజెక్టులు జిల్లాలో కొలువుదీరుతుండగా, తాజాగా మరో భారీ పరిశ్రమ విస్తరణకు అంకురార్పణ

## ఊరూరా బిఆర్ఎస్ కుట్రలపై ప్రచారం




- కెసిఆర్ హాయంలోనే కూలిన కాళేశ్వరం
- కేంద్ర నిపుణలు సూచనల మేరకు నీటి విడుదల
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని ఆరోపించారు.

## బద్రీనాథ్ ఆలయ విరాళాల లెక్కింపులో అక్రమాలు

**సస్పెండ్ అయిన అధికారి ప్రమోద్ నౌటియాల్ అరెస్ట్**

2లో

ఉత్తరాఖండ్ పోలీసులు బద్రీనాథ్ – కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ చైర్మన్ మాజీ వ్యక్తిగత సహాయకుడు , సస్పెండ్ అయిన

## చైనాను వణికిస్తున్న టైఫూన్ బావి

**వరదనీటిలో కార్లు కొట్టుకుపోయిన దృశ్యాలు**

చైనాను టైఫూన్ బావి వణికిస్తోంది. భారీ వర్షాలతో.. రహదారులు జలమయంగా మారాయి. లియావోనింగ్ ప్రావిన్స్‌లోని 2,60,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 2లో

## ఏసీబీ వలలో అవినీతి తిమింగలం...



పెద్దపల్లి మున్సిపల్ ఏఈ ఇంట్లో నోట్ల కట్టలు!

2లో

## సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత

కాపు ఉద్యమ నేత ముద్రగడ ఇకలేరు



2లో

## నెల్లూరు జిల్లాలో వ్యవసాయాధికారి హత్య..

2లో

సింగరాయకొండలో రైలు కిందపడి నిందితుడి కుటుంబం ఆత్మహత్య

# బోటు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించని సర్కార్

**ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది - మత్స్యకార కుటుంబాలకు జగన్ పరామర్శ**

**సర్కార్ తీరుపై మండిపడ్డ వైసిపి అధినేత**



మిగతా2లో

విశాఖలో బోటు ప్రమాదం జరిగిన వెంటనే చంద్రబాబు సర్కార్ ఎందుకు స్పందించలేదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. విశాఖలోని జబ్బర్‌తోటలో మత్స్యకార కుటుంబాలను ఆయన మంగళవారం పరామర్శించారు. బోటు ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌కు తమ కష్టాన్ని మత్స్యకారులు చెప్పుకున్నారు.. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 1న ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లారు. కేవలం పది మైళ్ల దూరంలోనే ఘటన జరిగింది. జులైన 4న చిన్నా ఫోన్‌చేసి ఇంటికొస్తున్నామని చెప్పాడు. దురదృష్టవశాత్తు ఫోన్ చేసిన కాసేపటికే బోటు ప్రమాదం జరిగింది. ఫిషరీస్ అధికారులు కూడా స్పందించలేదని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోటు ప్రమాదం జరిగిందని అధికారులకు మెసేజ్ చేశారు. రాత్రి 10:30కి కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టారు. వెంటనే స్పందిస్తే గంటల్లోనే మత్స్యకారులు దొరికేవారు. వెంటనే కోస్ట్‌గార్డ్ వచ్చి ఉంటే ఐదుగురైనా బతికేవారు. ఈనెల 5న చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడారు. తప్పుడు జరిగింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారు. త్రీమెన్ కమిటీ నివేదిక అంతా తప్పుల తడక. చంద్రబాబు ప్రభుత్వానికి మానవత్వం ఉందా? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఘటన జరిగిన వెంటనే ఒక్క అధికారి రాలేదు. ఉత్తరాంధ్ర మంత్రులు ఒక్కరు కూడా రాలేదు. బాధితులను ఫిషరీష్ మంత్రి కూడా పరామర్శించలేదు. బాధితుల వద్దకు మంత్రులను పంపాలని సీఎంకు తెలియదా?. రాత్రికి రాత్రే స్పందిస్తే మత్స్యకారులు బతికేవారు. ఎక్స్ గ్రేషియా కింద అరకొర సాయం చేశారు. బాధితులకు రూ.కోటి చొప్పన ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఏడుగురు మత్స్యకారులకు కుటుంబాలకు పరిహారం అందాలన్నారు. 5 లక్షలు ముష్టి వేస్తున్నావా.. ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు, కొత్త ఇల్లు మన ప్రభుత్వం వచ్చాక నెలలోపే ఆదుకుంటాం. గతంలో మా ప్రభుత్వంలో మత్స్యకారులకు భరోసా ఉండేది. 2018 పాదయాత్రలో మత్స్యకారులకు ఇచ్చిన మాట నెరవేర్చాం. పాక్‌లో చిక్కుకున్న మత్స్యకారులను సేఫ్‌గా తీసుకొచ్చాం అని వైఎస్ జగన్ గుర్తు చేశారు.

# రాయలసీమ ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా?

## వైసీపీకి సోమిరెడ్డి సవాల్

- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై వైసీపీ ఇప్పుడు సమీక్షల పేరుతో డ్రామా ఆడుతోందని సోమిరెడ్డి విమర్శ
- టీడీపీ 24 నెలల్లో రూ. 12,484 కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ ఐదేళ్లలో చేసిందేమీ లేదని ఆరోపణ
- ఎన్జీటీ ఇచ్చిన స్టేను నాలుగేళ్ల పాటు ఎందుకు ఎత్తించలేకపోయారని జగన్‌కు సూటిగా ప్రశ్న
- రాయలసీమ ప్రాజెక్టుల చరిత్ర, ఖర్చులపై వైసీపీతో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్
- జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేశారని, మైక్రో ఇరిగేషన్‌ను రద్దు చేసి సీమకు ద్రోహం చేశారని ఫైర్



# ఊరూరా బీఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

ఊరూరా తిరిగి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే.. వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజినీర్లు ఇచ్చిన సలహాలను పాటిస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలోకి రావాలంటే ఏం చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరఫున సూచనలు చేస్తున్నామని చెప్పారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్నామ్యాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని.. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# చైనాను వణికిస్తున్న టైఫూన్ బావి

వరదనీటిలో కార్లు బొమ్మల్లా కొట్టుకుపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మంగళవారం కూడా భారీ వర్షాలకు అవకాశం ఉందని చైనా జాతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. 13 రోజుల క్రితం పసిఫిక్ సముద్రంలో ఏర్పడిన ఈ టైఫూన్ ఫ్రాన్స్ దేశమంతా విస్తీర్ణాన్ని కలిగి ఉంది. దీని ప్రభావం జపాన్, తైవాన్, ఫిలిప్పీన్స్, ఉత్తర కొరియాలోనూ కనిపిస్తోంది.

## బోటు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించని సర్కార్

వైఎస్సార్‌సీపీ హయాంలో మత్స్యకారుల కోసం 10 ఫిషింగ్ హార్బర్‌లకు

శ్రీకారం చుట్టాం. మరో 6 ఫిష్ ల్యాండ్‌పనులు కూడా చేపట్టాం. ఈ రోజు ఫిషింగ్ హార్బర్‌లను స్కామ్‌లతో అమ్మేస్తున్నారు. ఏపీలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. ప్రభుత్వ స్కూల్ పిల్లలకు బుక్స్, యూనిఫాంలు లేవు. రాష్ట్రంలో రైతు రో÷-డడెక్కే పరిస్థితి ఉంది. ప్రజలతో బాబు చెలగాటమాడుతున్నారు' అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలు

ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మెరుగైన ఫలితాలు అందేలా నిర్ణయాలు ఉండాలని సీఎం సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని .. సరైన ప్రణాళిక ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. ఈ దేవాలయాలను ఆనుకుని ఆర్థిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలన్నారు. పర్యాటక కార్యకలాపాలు పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం కూడా ఇవ్వాలని సీఎం సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాల్ని పెంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్ఎస్‌కేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని... యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

**మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం** క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని బస్టాండ్‌లలోనూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. బస్సులు ఖచ్చితమైన సమయానికి వచ్చే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. గత పాలనలో రాజకీయ కక్షతో కొందరి భూముల్ని 22ఏ కింద పెట్టి వివాదంలోకి నెట్టారన్నారు. ఇప్పటికి 27 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, ఇంకా 72 లక్షల మందికి జారీ చేయాల్సి ఉందన్నారు. శెట్టిపల్లి భూ వివాదాన్ని పరిష్కరించటం ద్వారా రైతుల సమస్యలు తీరటంతో పాటు 900 కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ఇలాంటి అవకాశాలనే అన్ లాక్ చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌తో పాటు వివిధ రకాలుగా వచ్చే ప్రతీ అర్జీ, ఫిర్యాదునూ మానవతా కోణంతో పరిష్కరించాలని సీఎం సూచించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలతో పాటు వ్యక్తిగత, సామాజిక అంశాల్లో వచ్చే ఫిర్యాదులపై తగిన నిర్ణయాలు వేగంగా తీసుకోవాలన్నారు. రొటీన్‌గా ఉండే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని అన్నారు. గ్రీవెన్స్‌ల పరిష్కారం ఆధారంగా ఫిర్యాదులు తగ్గుతున్నాయా లేక పెరుగుతున్నాయో విశ్లేషించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయితే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఆర్టీజీఎస్ రూపొందించిన గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్ మాసపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షకు మంత్రి పార్థసారధి వర్చువల్‌గా, ఆర్టీజీఎస్ నుంచి సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# రాయలసీమ ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా?

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వైసీపీ ఇప్పుడు కొత్త డ్రామాకు తెరలేపిందని, ఐదేళ్ల పాలనలో వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఇప్పుడు సమీక్షల పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాజెక్టులపై తాము చేసిన ఖర్చు, వైసీపీ హయాంలో జరిగిన నిర్లక్ష్యంపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే రావాలని ఆయన సవాల్ విసిరారు. ఈరోజు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు.

**రాయలసీమ లిఫ్ట్‌పై ఇప్పుడు డ్రామాలు** 2020లోనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (ఆర్ఎల్ఐఎస్) పనులపై స్టే ఇచ్చిందని సోమిరెడ్డి గుర్తుచేశారు. "అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ అల్లుడు, మంత్రి హరీశ్ రావు తామే 18 లేఖలు రాసి, కేసులు వేసి ఆర్ఎల్ఐఎస్ పనులను ఆపించామని ఆనాడు 'నమస్తే తెలంగాణ' పత్రికలో గొప్పగా చెప్పుకున్నారు. మరి, కేసీఆర్‌తో స్నేహంగా ఉన్న జగన్.. ఆ స్టేను నాలుగేళ్ల పాటు ఎందుకు ఎత్తివేయించలేకపోయారు? ఇప్పుడు అధికారం కోల్పోయాక 'గొడ్డలి పార్టీ' నాయకులు సమీక్షలు, రౌండ్ టేబుల్ సమావేశాల పేరుతో కొత్త నాటకాలు ఆడుతున్నారు. ఈ సమీక్షలు మీ తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టుకుని, ఐదేళ్లలో మీరేం చేశారో ఆత్మపరిశీలన చేసుకోండి" అని సోమిరెడ్డి ఎద్దేవా చేశారు.

**ఖర్చులో పోలికే లేదు** టీడీపీ ప్రభుత్వానికి, వైసీపీ ప్రభుత్వానికి ప్రాజెక్టులపై ఉన్న చిత్తశుద్ధికి ఖర్చు చేసిన నిధులే నిదర్శనమని సోమిరెడ్డి పేర్కొన్నారు. "మేం అధికారంలోకి వచ్చిన వెంటనే 24 నెలల్లోనే ప్రాజెక్టులపై రూ. 12,484 కోట్లు ఖర్చు చేశాం. మరో రూ. 10 వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ మీరు 2019 నుంచి 2024 వరకు ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయగలరా? వైసీపీ నేత, ఉరవకొండ ఇన్‌ఛార్జ్ విశ్వేశ్వర్ రెడ్డే స్వయంగా తమ ప్రభుత్వ హయాంలో సీమకు ఏమీ చేయలేకపోయామని అంగీకరించారు. దీన్నిబట్టి చూస్తే రాయలసీమకు ద్రోహం చేసింది ఎవరో స్పష్టమవుతోంది" అని విమర్శించారు.

**చరిత్ర టీడీపీది.. విధ్వంసం వైసీపీది**
తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, వాటిని అత్యధికంగా పూర్తి చేసింది స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబు అని సోమిరెడ్డి గుర్తుచేశారు. "జగన్ రెడ్డి జీఓ 365 పేరుతో రాయలసీమలోని 102 సాగునీటి ప్రాజెక్టుల పనులను రద్దు చేశారు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోతే 39 మంది ప్రాణాలు కోల్పోయారు. కృష్ణా జలాల్లో మిగులు జలాలు కోరబోమని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు లేఖ రాసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీమకు తీరని అన్యాయం చేశారు. జలయజ్ఞం పేరుతో మీరు చేసింది ధనయజ్ఞం మాత్రమే" అని ఆరోపించారు.

**మైక్రో ఇరిగేషన్‌ను చంపేశారు** రాయలసీమ వంటి కరవు ప్రాంతానికి అత్యంత కీలకమైన మైక్రో ఇరిగేషన్ (బిందు, తుంపర సేద్యం) పథకాన్ని జగన్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సోమిరెడ్డి మండిపడ్డారు. "చంద్రబాబు హయాంలో 5 ఎకరాల సబ్సిడీని 10 ఎకరాలకు పెంచి, డ్రిప్ ఇరిగేషన్‌లో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపాం. కానీ జగన్ రాగానే ఆ పథకాన్ని రద్దు చేశారు. దీంతో రాయలసీమ రైతులు తీవ్రంగా నష్టపోయారు. పులివెందుల రెడ్లే తన వద్దకు వచ్చి ఈ విషయం అడుగుతున్నారని అప్పటి వ్యవసాయ మంత్రి కన్నబాబు జగన్‌తో చెప్పినా, 'నీ పని నువ్వు చూసుకో' అని విసుక్కున్నారంటే సీమ రైతులపై ఆయనకు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది" అని సోమిరెడ్డి అన్నారు.

**కూటమి ప్రభుత్వం కార్యాచరణ** ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టిందని సోమిరెడ్డి తెలిపారు. "నిర్వీర్యమైన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాం. కృష్ణా డెల్టాకు నీళ్లు లేకపోతే పట్టిసీమ ద్వారా 7 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నాం. రూ. 35,313 కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చంద్రబాబు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. సాగునీటి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిజాయతీగా, కష్టపడి పనిచేస్తున్నారు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూసే వైసీపీ నేతలకు రాయలసీమ పేరు ఎత్తే అర్హత కూడా లేదు" అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు:

మత్స్యకారులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ నెల 4న జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. విశాఖపట్నం సమీపంలోని జబ్బర్ తోటలో బాధిత మత్స్యకార కుటుంబాలను, ప్రమాదం నుంచి బయటపడిన చిన్నాను జగన్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తీరానికి 10 మైళ్ల దూరంలోనే ఘటన జరిగినా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు మత్స్యకారులు జలసమాధి అయ్యారని దుయ్యబట్టారు. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదన్నారు. 5వ తేదీన చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడటంతో అతను బ్రతికి బయటపడ్డాడని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారని, ఆ నివేదిక కూడా తప్పులతడకగా ఉందన్నారు. ప్రభుత్వానికి మానవత్వం లేదని, ఉంటే రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు కాదన్నారు. ఇప్పటికైనా బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, మత్స్యకార బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నెలలోపే బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# జగన్ శవ రాజకీయాలు మానాలి

వైసీపీ అధినేత జగన్ విశాఖ పర్యటనపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీవ్రంగా స్పందించారు. ఇప్పటికైనా జగన్ శవ రాజకీయాలు మానుకోవాలని హితవు చెప్పారు. విశాఖకు ఎందుకు వస్తున్నారో ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు ఎలాంటి న్యాయం చేయలేదని విమర్శించారు. వారికి చట్టప్రకారం చెల్లించాల్సిన బకాయిలు కూడా చెల్లించలేదన్నారు. మత్స్యకార నిధులను డైవర్ట్ చేశారని ఆరోపించారు. అసలు, మత్స్యకారులకు జగన్ ఏం చేశారో సమాధానం చెప్పాలని పల్లా శ్రీనివాసరావు సవాల్ విసిరారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి ప్రమాద ఘటన గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జగన్ రాజకీయ లాభం కోసమే విశాఖకు వస్తున్నారని ఆరోపించారు.

# రాయలసీమలో రూ.3,100 కోట్ల పెట్టుబడి.

జరగనుంది. జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండలం చిన్నకొమెర్ల వద్ద ఉన్న దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ రేపు (జులై 15) శంకుస్థాపన చేయనున్నారు. రూ.3,100 కోట్ల భారీ పెట్టుబడితో ఈ విస్తరణ పనులు చేపట్టనున్నారు. రెండు నెలల వ్యవధిలోనే మంత్రి లోకేశ్ ఇదే నియోజకవర్గంలో రెండోసారి పారిశ్రామిక కార్యక్రమానికి హాజరు కావడం గమనార్హం. ఈ ఏడాది మే 22న కొండాపురం మండలంలో 'సెయిల్' (ూాూ×ూ) సౌర విద్యుత్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఇప్పుడు దాల్మియా సిమెంట్ విస్తరణతో ఈ ప్రాంత పారిశ్రామిక ముఖచిత్రం మరింత మారనుంది.

**ఉత్పత్తి సామర్థ్యం, ఉద్యోగాల్లో భారీ పెరుగుదల** దాల్మియా సిమెంట్ సంస్థ రూ.3,100 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ విస్తరణ ద్వారా ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం మైలవరం ప్లాంటులో ఏటా 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి అవుతోంది. కొత్త ప్లాంట్ విస్తరణ పూర్తయ్యాక క్లింకర్ ఉత్పత్తి సామర్థ్యం 6.1 మిలియన్ టన్నులకు, సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది. ఈ విస్తరణ కేవలం ఉత్పత్తికే పరిమితం కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలను కూడా భారీగా పెంచనుంది. ఇప్పటికే ఉన్న ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 950 మంది ఉపాధి పొందుతుండగా, ఈ విస్తరణతో కొత్తగా మరో 700 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. దీంతో మొత్తం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 1,650కి చేరుకుంటుంది. ఈ ప్రాజెక్టు వల్ల రవాణా, లాజిస్టిక్స్ వంటి అనుబంధ పరిశ్రమల్లోనూ అదనపు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

**ప్రభుత్వ ఖజానాకు పెరగనున్న ఆదాయం** ఈ భారీ పరిశ్రమ విస్తరణతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం దాల్మియా సంస్థ పన్నులు, మైనింగ్ రాయల్టీల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.102 కోట్లు చెల్లిస్తోంది. ప్రతిపాదిత విస్తరణ పూర్తయితే ఈ ఆదాయం ఏకంగా రూ.325 కోట్లకు పెరుగుతుందని అంచనా.

**పర్యావరణ హితమే లక్ష్యంగా 'గ్రీన్ ఇండస్ట్రీ'** దాల్మియా సంస్థ రెండో దశ విస్తరణ పనులను కేవలం వాణిజ్యపరంగానే కాకుండా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా అత్యుత్తమ ప్రమాణాలతో 'గ్రీన్ ఇండస్ట్రీ'గా తీర్చిదిద్దనుంది. పరిశ్రమకు అవసరమైన విద్యుత్‌లో 80 శాతాన్ని సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక వనరుల నుంచే సమకూర్చుకోనుంది. మొత్తం ప్రాజెక్ట్ విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండేలా గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయనున్నారు. పరిశ్రమలో వాడిన నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేందుకు 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు సుమారు రూ.100 కోట్ల పెట్టుబడితో 130 అధిక సామర్థ్య బ్యాగ్ ఫిల్టర్లను ఏర్పాటు చేయనుండటం విశేషం.

**దేశంలో నాలుగో అతిపెద్ద సిమెంట్ సంస్థ** ఎనిమిది దశాబ్దాలకు పైగా సిమెంట్, చక్కెర, విద్యుత్ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న దాల్మియా భారత్ గ్రూప్, దేశంలో నాలుగో అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థగా గుర్తింపు పొందింది. రూ.14,800 కోట్ల వార్షిక టర్నోవర్‌తో, దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో 19 సిమెంట్ కర్మాగారాలు, గ్రైండింగ్ యూనిట్లను నిర్వహిస్తోంది. సుమారు 33,000 మందికి పైగా డీలర్ల నెట్‌వర్క్‌తో వినియోగదారులకు సేవలందిస్తోంది. ఈ సంస్థ భారీ విస్తరణ చేపట్టడం రాయలసీమ పారిశ్రామిక ప్రగతికి శుభసూచకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నేత, కాపు ఉద్యమ సారథి ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్తతో ఏపీ రాజకీయ వర్గాల్లో, ఆయన అనుచరుల్లో తీవ్ర విషాదం నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 1953, జనవరి 22న జన్మించిన ముద్రగడ పద్మనాభం, కాపు సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం సాగించిన ఉద్యమాలతో రాష్ట్రవ్యాప్తంగా బలమైన నేతగా గుర్తింపు పొందారు. తన రాజకీయ జీవితంలో అనేక పార్టీలలో పనిచేసిన ఆయన, ఇటీవలి కాలంలో వైసీపీలో చేరి, ఆ పార్టీలోనే కొనసాగారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ముద్రగడ, 1977లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1978లో జనతా పార్టీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ప్రత్తిపాడు నుంచి గెలిచారు. అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి 1983, 1985, 1989 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత టీడీపీతో విభేదించి ప్రజా రక్షణ సమితి, తెలుగునాడు పేర్లతో సొంత పార్టీలు స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా కూడా విజయం సాధించారు. రాజకీయ నాయకుడిగా కంటే కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభం రాష్ట్రవ్యాప్తంగా సుపరిచితులు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆయన అనేక పోరాటాలు, దీక్షలు చేపట్టారు. ముఖ్యంగా, 2016లో తునిలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన 'కాపు ఐక్య గర్జన' సభ, తదనంతర పరిణామాలు అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన రాజకీయ వైఖరి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ఓడిస్తానని సవాల్ విసిరారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించడంతో, తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ముద్రగడ తన పేరును 'ముద్రగడ పద్మనాభరెడ్డి'గా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారికంగా మార్చుకున్నారు. గత ఏడాది కాలంగా వయసు రీత్యా పలు ఆరోగ్య సమస్యలతో ఆయన తరచూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ముద్రగడకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు.

# బద్రీనాథ్ ఆలయ విరాళాల లెక్కింపులో అక్రమాలు

అధికారి ప్రమోద్ నౌటియాల్‌ను అరెస్ట్ చేశారు. డెహ్రాడూన్‌లోని అతడి నివాసంలో చమోలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం అతడిని బద్రీనాథ్‌కు తరలించారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి పోలీసు కస్టడీ కోరనున్నట్లు అధికారులు తెలిపారు. జులై 2వ తేదీన ఆలయ కానుకల లెక్కింపు సమయంలో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు, ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు విచారణ ప్రారంభించారు. బద్రీనాథ్ ఆలయ విరాళాల లెక్కింపులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో సీసీటీవీ ఫుటేజీ పరిశీలనలో ప్రమోద్ నౌటియాల్ నగదు లెక్కింపు గది నుంచి తన వ్యక్తిగత కార్యాలయానికి పలుమార్లు వెళ్లినట్లు గుర్తించారు. ఈ కేసు విచారణలో రూ.500, రూ.100 నోట్ల కట్టలు, బంగారు, వెండి నాణెలిలు, శాలిగ్రామ శిలలను దాచిపెట్టినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. ఆలయ విరాళాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను, పద్ధతులను పూర్తిగా ఉల్లంఘించినట్లు ఃఐ÷ుఅ అంతర్గత నివేదికలో కూడా ప్రాథమికంగా పేర్కొంది. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ క్రమంలోనే గర్వాల్ డివిజనల్ కమిషనర్ నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో ఉన్నతస్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసి పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా, కేదార్‌నాథ్ ఆలయ నిధుల వినియోగంలోనూ అక్రమాలు వెలుగుచూశాయి. వీఐపీల వసతి, భోజనాల పేరిట నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో మాజీ మేనేజర్, ఇన్‌చార్జ్ అధికారి, మాజీ సీఈఓలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు తన సస్పెన్షన్, ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ ప్రమోద్ నౌటియాల్ ఉత్తరాఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ జులై 16వ తేదీన జరగనుంది.

# తెలంగాణ తెలుగు అకాడమి

ప్రతిష్టాత్మక తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్, సీనియర్ అధ్యాపకులు ఆచార్య భట్టు రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు భాషా పరిరక్షణ, పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక భూమిక పోషించే తెలుగు అకాడమీ సారధ్య బాధ్యతలను ఆచార్య భట్టు రమేష్ కు అప్పగించడం పట్ల పలువురు విద్యావేత్తలు ఆచార్యులు పరిశోధకులు గిరిజన సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆచార్య భట్టు రమేష్ కు ఉన్నత విద్యారంగంలో మూడు దశాబ్దాలకు పైగా బోధనానుభవం ఉంది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా అత్యుత్తమ సేవలందించారు.

# నెల్లూరు జిల్లాలో వ్యవసాయాధికారి హత్య...

ప్రకాశం జిల్లాలో అత్యంత దారుణమైన, విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. ఓ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తి, తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ హృదయ విదారక ఘటన మంగళవారం సింగరాయకొండ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. ఒక హత్య, ఆ తర్వాత జరిగిన నాలుగు ఆత్మహత్యలతో రెండు కుటుంబాల్లోనూ తీరని శోకం మిగిలింది. వివరాల్లోకి వెళితే, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న ఎన్. శ్రీహరి గత నెల 15న హత్యకు గురయ్యారు. ఈ హత్య కేసులో ఆయన బావమరిది అయిన కుడుముల హరికృష్ణ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఆస్తి తగాదాల కారణంగానే హరికృష్ణ, తన బావమరిది శ్రీహరిని కారులో తీసుకెళ్లి, కుక్కలను చంపేందుకు వాడే ఇంజెక్షన్లు ఇచ్చి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం దానిని గుండెపోటుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు.అయితే, శ్రీహరి భార్య ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, దర్యాప్తులో అసలు నిజాన్ని నిగ్గుతేల్చారు. హత్య కేసు వెలుగులోకి రావడంతో హరికృష్ణ పరారయ్యాడు. అప్పటి నుంచి అతని కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే, పట్టుబడతాననే భయంతో హరికృష్ణ తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి మంగళవారం సింగరాయకొండ వద్ద రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా పోలీసులు వారిని గుర్తించారు. కాగా, శ్రీహరి హత్య కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్‌కు చెందిన సీఐతో సహా 23 మంది సిబ్బందిని ఉన్నతాధికారులు ఇటీవల బదిలీ చేయడం గమనార్హం. నెల రోజుల వ్యవధిలో జరిగిన ఈ రెండు దారుణ ఘటనలతో ఇరు కుటుంబాల సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# ఏసీబీ వలలో అవినీతి తిమింగలం...

## పెద్దపల్లి మున్సిపల్ ఏఈ కల్లేపల్లి సతీశ్ కుమార్ అరెస్ట్

## రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత

పెద్దపల్లి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం జరిపిన దాడిలో ఓ అవినీతి అధికారి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా (ఏఈ) పనిచేస్తున్న కల్లేపల్లి సతీశ్ కుమార్, ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడ, కునారం రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికల అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ.12.28 లక్షల తుది బిల్లును ప్రాసెస్ చేసి, మంజూరు కోసం పంపడానికి సతీశ్ కుమార్ ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు, కరీంనగర్ ఏసీబీ యూనిట్ అధికారులు పక్కా ప్రణాళికతో సతీశ్ కుమార్ నివాసంలో అతడు లంచం స్వీకరిస్తుండగా పట్టుకున్నారు. లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుకున్న అనంతరం, ఏసీబీ అధికారులు సతీశ్ కుమార్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో లెక్కల్లో చూపని రూ.32,31,900 నగదు లభించడంతో అధికారులు సైతం విస్మయానికి గురయ్యారు. లంచం సొమ్ముతో పాటు ఈ నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సతీశ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, కరీంనగర్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, టోల్ ఫ్రీ నంబర్ 1064 ద్వారా తమకు సమాచారం ఇవ్వాలని ఏసీబీ ప్రజలను కోరింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది.

# మత్స్యకార కుటుంబాలకు జగన్ అండ

## ఒక్కో కుటుంబానికి 7లక్షల సాయం ప్రకటన

మత్స్యకార కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు దీని గురించి వివరాలు తెలిపారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.7 లక్షల చొప్పున అందిస్తామని కేకే రాజు చెప్పారు. ఈ డబ్బును వైఎస్సార్‌సీపీ తరఫున అందిస్తామని అన్నారు. ప్రాణాలతో బయటపడ్డ చిన్నా కుటుంబాన్ని కూడా ఆదుకుంటామని వివరించారు. చిన్నా కుటుంబానికి రూ.7 లక్షల సాయం చేస్తామని చెప్పారు. ఇటీవల విశాఖ తీరంలో జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. అదే ప్రమాదంలో మృత్యువుతో పోరాడి ప్రాణాపాయం నుంచి బయటపడిన కారి చిన్నాను కూడా వైఎస్ జగన్ పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# పొగాకు రైతుకు అండ ఎవరు..?



**మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి**
**ధరలు పెంచుతామన్న ప్రభుత్వ హామీలు ఏమయ్యాయి..?**
**ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధం**
**డీసీపల్లి వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడిన విక్రమ్ రెడ్డి**

**మర్రిపాడు జులై 14నంది పత్రిక :** రాష్ట్రంలో వర్జీనియా పొగాకు రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నా ప్రభుత్వం ఎందుకు సమర్థవంతంగా జోక్యం చేసుకోవడం లేదని, ముఖ్యమంత్రి ధరలు పెంచాలని, తిరస్కరణలు ఉండకూడదని ఆదేశించిన కొద్ది రోజులకే పరిస్థితి మరింత దిగజారడం ఆందోళన కలిగిస్తోందని, ప్రభుత్వం చెబుతున్న కనీస ధర రూ.200 కూడా రైతులకు అందని పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేలం కేంద్రంలో రైతులతో నేరుగా మాట్లాడి పొగాకు ధరలు పడిపోవడం, అధిక తిరస్కరణలు, కొనుగోళ్ల మందగమనంతో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు.అంతకు ముందుగా డీసీపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి సునీల్ కుమార్ తో వేలం ప్రక్రియ జరుగుతున్న విధానం, ధరల తగ్గుముఖం తదితర విషయాలపై చర్చించారు. పొగాకు రైతులను ఆదుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం తీసుకునేలా చూడాలంటూ వినతిపత్రం సమర్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే పొగాకు ఉత్పత్తిలో భారతదేశం రెండవ స్థానంలో ఉందని, అయినా దానిని పండించే రైతు మాత్రం నష్టాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారన్నారు.డీసీపల్లి వేలం కేంద్రంలో 100 రోజులు పూర్తయినా కేవలం 17 శాతం పొగాకు మాత్రమే కొనుగోలు చేయడం ఆందోళనకరమన్నారు. ఇంకా 83 శాతం పొగాకు రైతుల గోదాముల్లోనే ఉండిపోవడం చూస్తే కొనుగోలు ప్రక్రియ ఎంత మందగించిందో అర్థమవుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు నెలల్లో కేవలం 32 మిలియన్ కిలోల పొగాకు మాత్రమే కొనుగోలు చేస్తే మిగిలిన పంటను ఎప్పుడు కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. వేలం కేంద్రాల్లో 50 శాతానికి పైగా బేళ్లను 'నో బిడ్' పేరుతో తిరస్కరిస్తున్నారని, రైతు శ్రమకు తగిన విలువ ఎందుకు దక్కడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గత ఏడాది బ్రైట్ పొగాకుకు రూ.280 నుంచి రూ.360 వరకు ధర లభించగా, ప్రస్తుతం రూ.160 వరకు పడిపోవడం రైతులను తీవ్రంగా నష్టపరుస్తోందన్నారు. ప్రస్తుతం బ్రైట్‌కు సగటున రూ.243, మీడియంకు రూ.216, లో గ్రేడ్‌కు రూ.187 మాత్రమే వస్తోందని, కనీసం బ్రైట్‌కు రూ.300, మీడియంకు రూ.280, లో గ్రేడ్‌కు రూ.250 ధర వస్తేనే రైతు గట్టెక్కే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు.ఒక్కో ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టిన రైతుకు సరైన ధర లేకపోవడంతో భారీ నష్టం తప్పడం లేదన్నారు. ఒక్కో బార్న్‌కు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసిన రైతుకు ప్రస్తుతం సుమారు రూ.10 లక్షలే తిరిగి వస్తుండటంతో దాదాపు రూ.5 లక్షల నష్టం ఎదురవుతోందని తెలిపారు.పొగాకు కంపెనీలు ఒకే విధమైన ధరలతో కొనుగోళు నిర్వహిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం, పొగాకు బోర్డు వాటిని ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించారు. పొగాకు బోర్డు రైతుల ప్రయోజనాలను కాపాడేలా పనిచేస్తోందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తరాది నల్లనేలల ప్రాంతంలో పొగాకు ధర కిలోకు గరిష్ఠంగా ఒక సీజన్ లో రూ.456 వరకు నమోదైందని, కరోనా సమయంలో కూడా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మార్క్‌ఫెడ్ ద్వారా రూ.200 కోట్లు కేటాయించి రైతులను ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా ప్రభుత్వం ప్రత్యేక జోక్యం చేసుకుని రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.నారా చంద్రబాబునాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చిన వర్షాలు పడే పరిస్థితి దాదాపు కనిపించదని, గతంలో ఆయన పాలనా కాలాన్ని పరిశీలిస్తే అనావృష్టితో రైతులు అల్లాడారని, ప్రస్తుతం కూడా అదే కొనసాగుతున్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి సైతం వర్షాలు కురవకపోతేనే మరింత ప్రకృతి సంపదను దోచుకోవచ్చుననే ఉన్నారని, ఆత్మకూరు నియోజకవర్గంలో ఇసుక, మట్టిని ఎలా కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారో, అదే విధంగా రైతులకు ఆదుకునేందుకు కూడా కొంత మేర చర్యలు తీసుకుంటే బాగుండేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.1,000 కోట్ల ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి ప్రభుత్వమే లేదా రైతుల సహకార సంఘాల ద్వారా నేరుగా పొగాకు కొనుగోలు చేయాలని విక్రమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులను నష్టపరుస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, పొగాకు బోర్డు సమన్వయంతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ప్రభుత్వం త్వరగా స్పందించకపోతే ప్రకాశం, నెల్లూరు సహా అన్ని పొగాకు జిల్లాల రైతులతో కలిసి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# రైతు నగర్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా యాసిడ్ విక్రయాలు?

**వేల లీటర్ల యాసిడ్ ఎక్కడికి పోతోంది?**
**ట్రేడ్ లైసెన్స్, సేల్స్ ట్యాక్స్ కట్టకుండానే విక్రయాలా**
**బోర్డు నిల్... బిల్లు నిల్**
**లక్షల్లో "0"వ్యాపారం.. చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు**

**నంద్యాల సిటీ బ్యూరో జూలై 14 ( నంది పత్రిక )** దేశంలో ఎవరైనా వ్యాపారం చేయాలంటే ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తారు. అనుమతులు లేకపోతే అధికారులు చర్యలు చేపడతారు. అయితే, నంద్యాల మండలం లోని రైతు నగర్‌లో ప్రాణాంతకమైన వివిధ రకాల యాసిడ్ విక్రయాలు ప్రభుత్వ అనుమతులు లేకుండా లక్షల లీటర్లలో సాగుతున్నా ప్రజలు అంటున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇటీవల ఎన్నో ప్రాంతాల్లో యాసిడ్ దాడులు జరిగిన సంఘటనలు చూస్తున్నాము. అయినప్పటికీ, రైతు నగర్‌లో యాసిడ్ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.వాస్తవానికి యాసిడ్‌ను మరుగుదొడ్లు క్లీన్ చేయడానికి, విత్తనశుద్ధికి ఉపయోగిస్తారు. వివరాల్లోకి వెళితే.. నంద్యాల మండలం రైతు నగర్‌లో ఇతర ప్రాంతం నుంచి వచ్చిన ఓ వ్యాపారి కొన్నేళ్లుగా యాసిడ్ విక్రయాలు సాగిస్తున్నారు. నిత్యం వేల లీటర్ల యాసిడ్ విక్రయాలు జరుగుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి ట్యాంకర్లతో నిత్యం నంద్యాలకు యాసిడ్ వస్తుంటుంది. చుట్టుపక్కల ప్రాంతాలకు నంద్యాల నుంచే యాసిడ్ సరఫరా అవుతోంది.




సీజన్‌లో పత్తి విత్తన కేంద్రాల వారు యాసిడ్‌ను కొనుగోలు చేస్తారు. వారిలో కొందరు విత్తన శుద్ధి కేంద్రాల నిర్వాహకులు, విత్తనాలను కడిగిన తర్వాత మిగిలిన యాసిడ్‌ను కుందూ, తెలుగుగంగ, కేసీ కెనాల్ కాలువల్లో కలుపుతున్నా.. ఇటీవలనే కుందులో వేల చేపలు కూడా చనిపోవడం జరిగింది. మామూళ్ల మత్తులో ఉన్న అధికారుల చర్యలు శూన్యం. యాసిడ్ అనేది నిత్యం వాడే వస్తువు కాకపోవడం, పైగా అది ప్రమాదకర రసాయనం అని అందరికీ తెలిసిందే. కాసింత చేతుల మీద పడితేనే బొబ్బలు వస్తాయి. అలాంటి యాసిడ్‌ను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు యాసిడ్ విక్రయించాలంటే మొదట ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. దీనితో పాటు పలు శాఖల అనుమతి తప్పనిసరి. ప్రధానంగా ఇది ప్రమాదకరం కాబట్టి పోలీస్, ఫైర్ శాఖల అనుమతులు ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి.

కానీ, ఈ యాసిడ్ ఎక్కడినుంచి వస్తోంది? బిల్లుతో వస్తుందా లేదా? ఎవరెవరికి విక్రయిస్తున్నారు? అనే వివరాలు ఎక్కడా కనిపించడం లేదు. లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా, కనీసం సేల్స్ ట్యాక్స్ కట్టకుండా ప్రభుత్వానికి చిల్లిగవ్వ ఇవ్వకుండా అక్రమ దందా సాగిస్తున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదు. వేల లీటర్ల ప్రమాదకర యాసిడ్ విక్రయాలు ఇష్టారాజ్యంగా సాగించడంప్త వల్ల, జరగరాని ఘోరం ఏదైనా జరిగితే బాధ్యులు ఎవరు? ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# అవార్డులు కాదు... విద్యార్థుల అభివృద్ధే ఉపాధ్యాయుడి కొలమానం

**పోరుమామిళ్ల, జులై 14: (నంది పత్రిక)**ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణానికి పునాది వంటిది. ఒక మంచి ఉపాధ్యాయుడు తన విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే శిల్పి. అలాంటి ఉపాధ్యాయుడి గొప్పతనం ఆయన గోడపై వేలాడే అవార్డులతో కాకుండా, ఆయన వద్ద చదివిన విద్యార్థులు జీవితంలో సాధించిన విజయాలతో కొలవాలి. నేటి పరిస్థితుల్లో కొంతమంది ఉపాధ్యాయులు బోధన కంటే అవార్డులు, ప్రశంసాపత్రాలు, గుర్తింపుల కోసం ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే అభిప్రాయాలు విద్యావర్గాల్లో వినిపిస్తున్నాయి. తరగతి గదిలో బోధనను నిర్లక్ష్యం చేస్తూ, ఇతర ఉపాధ్యాయులతో అవార్డుల కోసం పోటీ పడుతూ, వాక్చాతుర్యంతో కేవలం అవార్డులు, గుర్తింపు ల కోసం మాత్రమే ప్రయత్నించడం విద్యావ్యవస్థ లక్ష్యాలకు విరుద్ధం.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే క్రమంలో చేసిన కృషికి గుర్తింపుగా అవార్డులు రావడం అభినందనీయమే. అయితే, అవార్డులే అంతిమ లక్ష్యంగా మారి, తరగతి గదిలో బోధన, విద్యార్థుల అభ్యాసంపై ప్రభావం పడకూడదని విద్యావేత్తలు సూచిస్తున్నారు. నిజమైన ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) వినియోగంతో ఆసక్తికరమైన పాఠాలను రూపొందిస్తాడు. విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ, సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం ఉపాధ్యాయుని అసలైన బాధ్యత. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం మాత్రమే కాదు, మంచి పౌరులుగా తీర్చిదిద్దడం కూడా ఉపాధ్యాయుని కర్తవ్యమే. అవార్డుల కోసం కృషి చేసే ఉపాధ్యాయుల శ్రమను తక్కువ అంచనా వేయలేం. కొత్త బోధనా పద్ధతులను అమలు చేయడం, పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం, విద్యార్థులను వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచేలా తయారు చేయడం, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించడం వంటి అనేక అంశాల్లో వారు శ్రమిస్తారు.

ఆ కృషికి తగిన గుర్తింపు రావడం అవసరమే. అయితే ఆ గుర్తింపు విద్యార్థుల అభ్యాసానికి తోడ్పడే సేవలకు ప్రతిఫలంగా రావాలి.పాఠశాలలో ప్రతి విద్యార్థి నేర్చుకునే స్థాయిని పెంచడం, డ్రాప్‌అవుట్‌లను తగ్గించడం, హాజరు శాతాన్ని మెరుగుపరచడం, తల్లిదండ్రులతో సమన్వయం పెంచడం, పాఠశాల వాతావరణాన్ని విద్యార్థులకు అనుకూలంగా మార్చడం వంటి అంశాల్లో విశేష కృషి చేసిన ఉపాధ్యాయులే నిజమైన ఆదర్శ ఉపాధ్యాయులు. సమాజం కూడా ఉపాధ్యాయులను కేవలం అవార్డుల ఆధారంగా కాకుండా, వారి బోధనా నాణ్యత, విద్యార్థుల అభివృద్ధి, పాఠశాల పురోగతి, సామాజిక బాధ్యతల ఆధారంగా గుర్తించి ప్రోత్సహించాలి.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రతి ఉపాధ్యాయుడి సేవకు గౌరవం ఇవ్వడం సమాజ బాధ్యత. ఒక అవార్డు ఉపాధ్యాయుని సేవకు గుర్తింపు కావచ్చు. కానీ వేలాది మంది విద్యార్థుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయే గురువు కావడం ఏ అవార్డుకన్నా గొప్ప గౌరవం. నిజమైన ఉపాధ్యాయుని విజయం ఆయన చేతుల్లో చదివిన విద్యార్థులు సమాజంలో మంచి వ్యక్తులుగా, బాధ్యతగల పౌరులుగా ఎదగడంలోనే ఉంటుంది. అవార్డులు వస్తాయి, పోతాయి... కానీ ఒక మంచి గురువు ప్రభావం తరతరాల పాటు నిలిచి ఉంటుంది.

## రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గల వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి పోలీసుల స్ట్రాంగ్ వార్నింగ్

**జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్ గారి ఆదేశాల మేరకు**
**నేరాలకు దూరంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని**
**హెచ్చరించిన వై.ఎస్.ఆర్ కడప జిల్లా పోలీసులు**



**వై.ఎస్.ఆర్ కడప జిల్లా..** వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్ గారి ఆదేశాల మేరకు, జిల్లాలో నేర నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ విస్తృత చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో సోమవారం జిల్లా లోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లు, నేరచరిత్ర గల వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు.

**కౌన్సిలింగ్ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ** సమాజంలో సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని స్పష్టంగా సూచించారు. నేరాల వైపు వెళ్లకుండా గౌరవప్రదమైన జీవనం గడపాలని హితవు పలికారు.అదేవిధంగా, భవిష్యత్తులో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో శాంతియుత వాతావరణం కొనసాగించేందుకు, ప్రజల భద్రతే ధ్యేయంగా జిల్లా పోలీసు శాఖ ఇలాంటి అవగాహన, నియంత్రణ చర్యలను నిరంతరం కొనసాగిస్తుందని తెలిపారు.



## ట్రాఫిక్ ఎస్ఐ తులసిరామ్ వాహనాల తనిఖీ...



**నంది ప్రతినిధి, జూలై 14, వైయస్సార్ కడప జిల్లా...**జిల్లా ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప పలుచోట్ల ట్రాఫిక్ ఎస్ఐ తులసిరా మరియు సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్కు పిలిపించి. వాళ్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి. నారాయణ కాలేజ్, చైతన్య కాలేజ్ గాయత్రి కాలేజ్, రైతు బజార్ కి ఎదుర్కొండా ఉండేటువంటి కాలేజీ చాలామంది విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం. 20 సంవత్సరాలు రాకుండా కూడా వాహనం వాహనాలు నడుపుతున్నటువంటి వారిని వారి యొక్క ఆధార్ కార్డు పరిశీలించిన పిదప సిబ్బంది ఎవరైతే వాహన నడుపుతున్నారు వాళ్ళ తల్లిదండ్రుల యొక్క ఆధార్ కార్డు పూర్తిగా పరిశీలించిన తరువాత మీకు ఇది మొట్టమొదటిసారి మేము చెబుతున్నాము మీ లైసెన్స్ రద్దు చేయిస్తామని చెప్పడం జరిగింది. అలాగే ఎలక్ట్రిక్ బైక్స్ వచ్చిన తర్వాత పిల్లలు చాలా అతివేగంగా వెళుతున్నారు. స్పోర్ట్స్ బైక్ వచ్చిన తర్వాత చాలా అతివేగంగా వెళుతున్నారు కనీసం హెల్మెట్ కూడా ధరించినటువంటి పిల్లలు చాలా స్పీడ్ గా వెళుతున్నారు ఎర్రముక్కపల్లి సంధ్యా సర్కిల్ నాగరాజు పేట పాత బస్టాండ్ ఆర్టీసీ బస్టాండ్ దగ్గర విద్యార్థులు యొక్క వాహనాలు మరియు విద్యార్థిని యొక్క వాహనాలు స్వాధీనం చేసుకుని. తల్లిదండ్రుల్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్దకు రమ్మనమని కబురు పంపారు. ట్రాఫిక్ సిబ్బంది వాళ్ళ యొక్క తల్లిదండ్రుల యొక్క ఆధార్ కార్డులో మరియు విద్యార్థిని విద్యార్థుల యొక్క ఆధార్ కార్డులు పరిశీలించిన తరువాత ఎవరైతే వాహనం మీద కూర్చుని ముగ్గురు ప్రయాణం చేస్తున్నారు. వాళ్లందరికీ కూడా ట్రాఫిక్ సిబ్బంది మరియు ఎస్సై తులసి రామ్ మాట్లాడుతూ. వారికి మంచి మాటలు చెప్పి మీరు చదువుకునేటువంటి విద్యార్థులు కాబట్టి బాగా చదువుకొని మంచి అభివృద్ధిలోకి రావాలి తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి పెట్టాలని హితవు పలికారు.

## నిర్మలా ఇంగ్లీష్ మీడియం స్కూల్, కడప నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" నాటక ప్రదర్శన



**కడప జులై 14:** జిల్లా ఎస్పీ శ్రీ నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ వారి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం నిర్మలా ఇంగ్లీష్ మీడియం స్కూల్, కడప నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" ఇన్‌చార్జ్ జి.నరసరామ్ మరియు టీమ్ చే 'ఓయువతా... మేలుకో" నాటక, పాటల ప్రదర్శన ద్వారా మాధకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈసందర్బంగా కడప 2 పట్టణ సిఐ శ్రీహరి మాట్లాడుతూ నేటిసమాజంలో యువత "డ్రగ్స్"కు దూరంగా ఉండి వారి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాలు వాడిన, అమ్మిన, ఆశ్రయం కల్పించిన దానికి తగిన శిక్షలు గురించి తెలియజేశారు.మత్తు పదార్థాల ఆచూకీ తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కి కాల్ చేసి తెలియజేయాలన్నారు. ప్రిన్సిపాల్ విజయారాణి మాట్లాడుతూ మత్తుపదార్థాల వాడకంవల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, సమాజంలోని రుగ్మతలు వాటివలన కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే మీ తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చి సమాజానికి ఉపయోగపడాలని హితువు పలికారు. ఈగల్ టీమ్ అయూబ్ ఖాన్, గురుశేఖర్ లు విద్యార్థులచే "యువతా మేలుకో-మత్తు నుండి తేరుకో, డ్రగ్స్ వద్దు- జీవితం ముద్దు, మత్తుపదార్థాలకు దూరంగా ఉందాం- భవిష్యత్తును కాపాడుకుందాం" అని నినాదాలు చేయించారు."పోలీసు కళా-జాగృతి బృందం" ప్రదర్శన విద్యార్థులను అలరించింది. ఈకార్యక్రమంలో స్కూల్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మరియు కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.



## వియత్నాం బోటు ప్రమాద బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కలెక్టర్..!



**కడప, బ్యూరో చీఫ్ జూలై 14 నంది పత్రిక** వియత్నాం బోటు ప్రమాదంలో మృతి చెందిన ముడియం శ్రీధర్ భౌతికకాయం కడపకు చేరుకున్న సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి.. వారి అకాల మరణం తీవ్ర విషాదకరమనన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, జిల్లా యంత్రాంగం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.మృతుడు శ్రీధర్ పనిచేసిన కంపెనీ తరపున అందించాల్సిన పరిహారం, సహాయ సహకారాలు, ఇతర అవసరమైన చర్యలు త్వరగా పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. శ్రీధర్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు గట్టి మనోధైర్యాన్ని ఆ దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట.. కడప ఆర్డీవో మురళి, కేఎంసీ కమిషనర్ భవానీ ప్రసాద్, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, ఇతర అధికారులు పాల్గొన్నారు..



## కడమల కాల్వ, వెంగళరెడ్డి పేట లలో పొలం పిలుస్తోంది



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 14 :** బండి ఆత్మకూరు మండల పరిధిలోని కడమలకాలువ వెంగలరెడ్డిపేట గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో రైతులు పంట బీమా చేసుకోవడానికి జులై 31 వ తారీకు ఆఖరి కావున రుణాలు పొందిన రైతులు బ్యాంకులో ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని, రుణం తీసుకొని రైతులు సిఎస్ సి సెంటర్ లో పంట బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏక పంట కాకుండా బహుళ పంటలు వేసుకోవడం వలన రైతులకు ఆర్థికంగా లాభాలు ఉంటాయని, వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని వారు తెలిపారు. వరి పంట సాగులో సూడోమోనస్ బయోఫస్టిసైడ్ పిచికారి చేసుకోవడం వలన నెల రోజుల నుంచి సంక్రమించే తెగుళ్లు 20 నుంచి 30 రోజుల పాటు తగ్గించుకోవచ్చునని అన్నారు. నార కొసలు తుంచి నాటుకోవడం వలన కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చునని, అంతే కాకుండా పిలకలు అధికంగా రావడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల వైస్ ఎంపీపీ రాగల రమణ, వ్యవసాయ విస్తరణ సిబ్బంది శక్రు నాయక్, వీఆర్వో వెంకటేశ్వర్లు పంచాయతీ సెక్రెటరీ పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క రైతు పంట నమోదు చేసుకోండి:: సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్.

**నంది పత్రిక ఆత్మకూరు..** నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పొలం పిలుస్తుంది రా కార్యక్రమం నేడు ఆత్మకూర్ అగ్రికల్చర్ కార్యాలయం నందు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మకూర్ సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు పంట నమోదు చేసుకోవాలని అదేవిధంగా పంటను ఇన్సూరెన్స్ చేసుకుంటే రైతులకు మేలు జరుగుతుందన్నారు. సమావేశానంతరం రైతులకు మందులను పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ లు లలితమ్మ సతీష్ మహేష్ రాజశేఖర్ ఎంపిఇఓ ముర్తుజావలి రైతు సంఘం నాయకులు టపాల్ అష్రఫ్ అలీ, టిడిపి నాయకులు సుబ్బరాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఎల్‌నినో పరిస్థితులపై రైతులకు అవగాహన.





**నంద్యాల సిటీ బ్యూరో జులై 14 ( నంది పత్రిక )** ప్రస్తుతం మన రాష్ట్రం లో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సకాలంలో సాంకేతిక సూచనలు అందించి పంటలపై ప్రతికూల ప్రభావాన్ని తగ్గించేందుకు ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జిల్లా స్థాయిలో ఎల్‌నినో మానిటరింగ్ బృందం ఏర్పాటు చేయబడింది. ఈ బృందంలో జిల్లా వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, నంద్యాల శాస్త్రవేత్తలు , కృషి విజ్ఞాన కేంద్రం, యాగంటిపల్లి శాస్త్రవేత్తలు సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం ప్రధాన లక్ష్యం జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడం, వర్షపాత పరిస్థితులు , పంటల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షించడం, అలాగే రైతులకు వ్యవసాయ సలహాలను వ్యవసాయ శాఖ విస్తరణ సిబ్బంది అయిన వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది ద్వారా చేరవేయడం. దీని ద్వారా నంద్యాల జిల్లాలో సాగవుతున్న పంటలపై ఎల్‌నినో వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలను తగ్గించి రైతులకు తగిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించడం జరుగుతుంది. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డా. కె. అశోక్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త , డా. ఎ. మల్లీశ్వర రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త, డా. ఆర్. నసీరుద్దీన్, శాస్త్రవేత్త , ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, నంద్యాల ఈ క్రింది సూచనలు సూచించారు. సాధారణంగా జూలై నెలలో నంద్యాల జిల్లాకు 116 మి.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 6 మి.మీ. మాత్రమే నమోదైందని తెలిపారు. దీంతో జిల్లాలోని 30 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న పంటల సాగును సాధ్యమైనంత వరకు తగ్గించడం మంచిది. జూన్‌లో విత్తిన పంటల్లో వాడిపోతున్న లక్షణాలు కనిపిస్తున్నందున, పంటలు బెట్ట పరిస్థితులను తట్టుకునేందుకు లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

బోరు బావులు క్రింద సాగు చేస్తున్న మొక్కజొన్న, పత్తి పంటలకు నీటి వినియోగాన్ని ఆదా చేసేందుకు వరుస విడిచి వరుసకు నీటిపారుదల అందించాలి. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ తక్కువ పంట కాలం గల మినుములు, కొర్రలు, సజ్జలు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. నేలలో తేమను ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు అంతర కృషి చేయడం ద్వారా ఆవిరి రూపంలో నీటి నష్టాన్ని తగ్గించవచ్చు. ఈ సందర్భంగా ఆర్. గంగాధర్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు, ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు, రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు, వ్యవసాయ శాఖ ద్వారా చేపడుతున్న చర్యలను వివరించారు. రైతులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.తరువాత "పొలం పిలుస్తోంది" కార్యక్రమం లో ఇ. ప్రసాద రావు, మండల వ్యవసాయ అధికారి ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు, వ్యవసాయ శాఖ ద్వారా చేపడుతున్న చర్యలను వివరించారు . పంటల భీమా పథకం గురించి కూడా రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు ఎల్‌నినో పరిస్థితుల్లో అనుసరించాల్సిన సాగు విధానాలు, ప్రత్యామ్నాయ పంటలు, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యంపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులు శాస్త్రీయ సిఫార్సులను అనుసరించి వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.



# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ) గడువును మూడు నెలలు పొడిగించాలి





**అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ నాగమణికి వినతి.**

**సిపిఐ బేతంచెర్ల మండల కార్యదర్శి యన్నా భార్గవ్.**

**బేతంచెర్ల జులై 14 ( నందిపత్రిక ).** ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అనేక లోపాలు చోటుచేసు కుంటున్నాయని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్. యన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును మరో మూడు నెలలపాటు పొడిగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బేతంచెర్ల మండల తహసిల్దార్ నాగమణికి వినతిపత్రం అందజేశారు అనంతరం భార్గవ్ మాట్లాడుతూ. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును పరిరక్షించడం,ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యత అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగి పోతున్నాయనే ఫిర్యాదులు రాష్ట్రవ్యాప్తంగా వస్తున్నాయని, మరణించిన వారి పేర్లు,నకిలీ ఓటర్లను తొలగించడం అవసరమే అయినప్పటికీ,ఆ పేరుతో నిజమైన ఓటర్ల హక్కులు దెబ్బతిన కూడదన్నారు.గడువు ముగిసే లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేయలేని వేలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు,ఆన్‌లైన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన వారికి కూడా సరైన సమాచారం అందడం లేదని, సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తుల స్థితి తెలియని పరిస్థితి నెలకొన్నదన్నారు.ఆధార్, ఎపిక్ వివరాల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నా దరఖాస్తులు నిలిచిపోతున్నాయని,చాలా చోట్ల బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఫారాలు అందించక పోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగి పోకుండా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరగాలన్నారు.రాజకీయ ప్రమేయానికి ఆస్కారం లేకుండా, ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రం లోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తికాకపోవడం ఆందోళన కరమని,ప్రజలకు సరైన అవగాహన కల్పించి నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు ఎస్ఐఆర్ గడువును మరో మూడు నెలలు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలాచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్,డి.దస్తగిరి, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి మధు,సీపీఐ నాయకులు ఎల్లక్రిష్ణ,గోపి,ఉదయ్, శివ,దేవరాజు, ఖదీర్,మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు నగర్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా యాసిడ్ విక్రయాలు?

**వేల లీటర్ల యాసిడ్ ఎక్కడికి పోతోంది?**

**ట్రేడ్ లైసెన్స్, సేల్స్ ట్యాక్స్ కట్టకుండానే విక్రయాలా**

**బోర్డు నిల్... బిల్లు నిల్**

**లక్షల్లో "0"వ్యాపారం.. చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు**

**నంద్యాల, జూలై 14,** దేశంలో ఎవరైనా వ్యాపారం చేయాలంటే ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తారు. అనుమతులు లేకపోతే అధికారులు చర్యలు చేపడతారు. అయితే, నంద్యాల మండలం లోని రైతు నగర్‌లో ప్రాణాంతకమైన వివిధ రకాల యాసిడ్ విక్రయాలు ప్రభుత్వ అనుమతులు లేకుండా లక్షల లీటర్లలో సాగుతున్నా ప్రజలు అంటున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇటీవల ఎన్నో ప్రాంతాల్లో యాసిడ్ దాడులు జరిగిన సంఘటనలు చూస్తున్నాము. అయినప్పటికీ, రైతు నగర్‌లో యాసిడ్ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.వాస్తవానికి యాసిడ్‌ను మరుగుదొడ్లు క్లీన్ చేయడానికి, విత్తనశుద్ధికి ఉపయోగిస్తారు. వివరాల్లోకి వెళితే.. నంద్యాల మండలం రైతు నగర్‌లో ఇతర ప్రాంతం నుంచి వచ్చిన ఓ వ్యాపారి కొన్నేళ్లుగా యాసిడ్ విక్రయాలు సాగిస్తున్నారు. నిత్యం వేల లీటర్ల యాసిడ్ విక్రయాలు జరుగుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి ట్యాంకర్లతో నిత్యం నంద్యాలకు యాసిడ్ వస్తుంటుంది. చుట్టుపక్కల ప్రాంతాలకు నంద్యాల నుంచే యాసిడ్ సరఫరా అవుతోంది. సీజన్‌లో పత్తి విత్తన కేంద్రాల వారు యాసిడ్‌ను కొనుగోలు చేస్తారు. వారిలో కొందరు విత్తన శుద్ధి కేంద్రాల నిర్వాహకులు, విత్తనాలను కడిగిన తర్వాత మిగిలిన యాసిడ్‌ను కుందూ, తెలుగుగంగ, కేసీ కెనాల్ కాలువల్లో కలుపుతున్నా.. ఇటీవలనే కుందులో వేల చేపలు కూడా చనిపోవడం జరిగింది. మామూళ్ల మత్తులో ఉన్న అధికారుల చర్యలు శూన్యం. యాసిడ్ అనేది నిత్యం వాడే వస్తువు కాకపోవడం, పైగా అది ప్రమాదకర రసాయనం అని అందరికీ తెలిసిందే. కాసింత చేతుల మీద పడితేనే బొబ్బలు వస్తాయి. అలాంటి యాసిడ్‌ను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా విక్రయిస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు యాసిడ్ విక్రయించాలంటే మొదట ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. దీనితో పాటు పలు శాఖల అనుమతి తప్పనిసరి. ప్రధానంగా ఇది ప్రమాదకరం కాబట్టి పోలీస్, ఫైర్ శాఖల అనుమతులు ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ, ఈ యాసిడ్ ఎక్కడినుంచి వస్తోంది? బిల్లుతో వస్తుందా లేదా? ఎవరెవరికి విక్రయిస్తున్నారు?

అనే వివరాలు ఎక్కడా కనిపించడం లేదు. లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా, కనీసం సేల్స్ ట్యాక్స్ కట్టకుండా ప్రభుత్వానికి చిల్లిగవ్వ ఇవ్వకుండా అక్రమ దందా సాగిస్తున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదు. వేల లీటర్ల ప్రమాదకర యాసిడ్ విక్రయాలు ఇష్టారాజ్యంగా సాగించడం వల్ల, జరగరాని ఘోరం ఏదైనా జరిగితే బాధ్యులు ఎవరు? ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆదర్శ పాఠశాల ఏపీ మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల, సందర్శించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు.



**రుద్రవరం ప్రతినిధి జులై 14 (నంది పత్రిక):** రుద్రవరం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల, రుద్రవరంను ఈరోజు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు దానాల రవికాంత్ , సి.హెచ్. ఖాసి సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్శనలో భాగంగా కమిటీ సభ్యులు పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం అమలు, తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, అటల్ టింకరింగ్ ల్యాబ్ గ్రంథాలయం, బాలికల వసతి గృహం, తాగునీటి సౌకర్యాలు, పరిశుభ్రత, పచ్చదనం, క్రీడా మైదానం తదితర మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో వారి విద్యాభ్యాసం, వసతి, భోజనం, బోధన విధానం, సంక్షేమ చర్యలపై అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో నెలకొల్పిన పరిశుభ్రమైన వాతావరణం, విద్యార్థుల క్రమశిక్షణ, నాణ్యమైన బోధన, విద్యా ప్రమాణాలు, బాలికల భద్రత, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో ఆదర్శప్రాయంగా ఉన్నాయని కమిటీ సభ్యులు ప్రశంసించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పాఠశాలను అభివృద్ధి చేస్తున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు.అదేవిధంగా ఇటీవల పాఠశాల సాధించిన విద్యా విజయాలు, పోటీ పరీక్షల్లో విద్యార్థులు నమోదు చేసిన ప్రతిభ, నెట్ జీరోహెల్తీ క్యాంపస్ కార్యక్రమం, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ చర్యలు, అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలను పరిశీలించి, "ప్రభుత్వ విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలిచే విధంగా ఏపీ మోడల్ స్కూల్ అభివృద్ధి చెందుతోంది" అంటూ ప్రత్యేకంగా కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే దిశగా ఇదే స్ఫూర్తితో ముందుకు



సాగాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత ఫలితాలు సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ, కమిటీ సభ్యుల సందర్శన తమ పాఠశాలకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించిందని, వారు అందించిన విలువైన సూచనలను అమలు చేసి విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రజనీ, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్ బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సోయాబీన్ పంట సాగుపై రైతులకు శిక్షణ

### ఎల్ నినో (బెట్ట పరిస్థితుల)ను ఎదుర్కొనేలా మెలకువలు



**వెలుగోడు, జూలై 14 (నంది పత్రిక):** వెలుగోడు మండలం రేగడ గూడూరు గ్రామ రైతు సేవా కేంద్రం నందు ఎన్.ఎఫ్.ఎస్.ఎం.వాల్యూ క్లస్టర్ చైన్స్ పథకం కింద సోయా చిక్కుడు (కేడీఎస్ 753 రకం) విత్తనాలు పొందిన రైతులకు మంగళవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెలుగోడు మండల వ్యవసాయ అధికారి ఎస్. స్వాతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు హాజరై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.ఈ శిక్షణా కార్యక్రమానికి నంద్యాల జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీమతి సరళమ్మ, వ్యవసాయ అధికారులు హేమ సుందర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలతో పాటు 'మన ఊరి నేస్తాలు' ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ ( వేంపెంట, పాములపాడు) సిబ్బంది హాజరయ్యారు.నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త (ఎంటమాలజీ) మంజునాథ్, ప్లాంట్ బ్రీడింగ్ విభాగ శాస్త్రవేత్త రమాదేవి రైతులకు సోయాచిక్కుడు పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా ఈ ఖరీఫ్ సీజన్లో రాబోతున్న 'ఎల్ నినో' వంటి ప్రకృతి విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొని, బెట్ట పరిస్థితుల్లో కూడా పంటను ఎలా కాపాడుకోవాలో రైతులకు వివరించారు.శిక్షణ అనంతరం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు కలిసి రేగడ గూడూరులోని సోయాబీన్ సాగు పొలాలను స్వయంగా సందర్శించి, పంట స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల కోసం కీలక సూచనలు చేశారు:బెట్ట నివారణకు: వర్షాభావ పరిస్థితుల వల్ల మొక్కలు వడిలిపోయినట్లు అనిపిస్తే, వెంటనే మల్టీ-కె లేదా నానో యూరియా స్ప్రే చేయడం ద్వారా పంట బెట్టను తట్టుకుని నిలబడుతుంది.రసం పీల్చే పురుగుల నివారణకు: ఇలాంటి వాతావరణంలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, నివారణకు అసిఫేట్ 1.5 గ్రాములు (లేదా లీటర్ నీటికి సరిపడా మోతాదులో) కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ సిబ్బంది, మరియు గ్రామానికి చెందిన సోయాబీన్ సాగు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పోలీసుల పనితీరు బేష్





### -క్రైమ్ రేట్ తగ్గించడంలో పోలీసుల కృషి మెచ్చుకోతగినది సమస్యలు ఉంటే ప్రజలు పోలీసులను ఆశ్రయించాలి.
### -జిల్లా ఎస్పీ సునీల్ షారన్

**కొత్తపల్లి - నంది పత్రిక:** మండలంలోని ప్రజల పట్ల పోలీసుల సేవలు భేష్ అని, మండలంలో క్రైమ్ రేట్ తగ్గించడంలో పోలీసుల కృషి మెచ్చుకోతగినదని జిల్లా ఎస్పీ సునీల్ షారన్ అభివర్ణించారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలను, సిబ్బంది సమస్యలను, రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. పోలీసు సిబ్బంది యొక్క పనితీరుపై ఆరా తీశారు. ఆదేవంగా మండలంలోని రైతులు, ప్రజలు, ప్రజల జీవన విదానం గురించి అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలకు సేవలు అందించడంలో పోలీసుల పనితీరు. మండలంలో అల్లర్లు, గోడవలు, ఘర్షణలు, ఇతర మేజర్ క్రైమ్ రేట్ పెరగకుండా చేయడంలో పోలీసుల పనితీరు మెచ్చుతగిందన్నారు. పోలీస్టేషన్ పరిసరాలు కూడా బాగున్నాయన్నారు. మండలం నల్లమల అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న ప్రజలు, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, ప్రాశాంతంగా ఉంచేందుకు కృషిచేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇలాగే గ్రామాలను ప్రశాంతంగా ఉండాలని, ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు పనిచేయాలన్నారు. అదేవిధంగా మండల ప్రజలు ఎటువంటి సమస్య ఉన్నా పోలీసు



అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చేసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామాలలో నాటుసారా అమ్మకాలు, అక్రమంగా మద్యం అమ్మకాలు, ఇతర ఆసాంఘీక కార్యకలపాలపై దృష్టిపెట్టి అరికట్టాలన్నారు. స్టేషన్కు వచ్చే ప్రజలతో స్నేహపూర్వంగా ఉండాలని సూచించారు. పోలీసుల పనితీరు, రికార్డుల. రిజిస్టర్ల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్ఐఐ జయశేఖర్ గౌడ్ లు ఉన్నారు.

### ఆరుతడి పంటల వైపే మొగ్గు చూపండి: ఏఓ సుమతి



**రుద్రవరం ప్రతినిధి జులై 14 (నంది పత్రిక):** వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుమతి తెలిపారు. మంగళవారం రుద్రవరం మండలం లోని కె కొత్తూరు చిన్నయ్య స్వామి చెంచు గూడెం లలో వ్యవసాయ అధికారిని జి. సుమతి ఆధ్వర్యంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు తక్కువగా కురుస్తున్నాయి కాబట్టి రైతులు వరి పంట వైపు మొగ్గ చూపకుండా ఆరుతడి పంటలైన మినుము ,పెసర మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. అలాగే డ్రిప్ మరియు స్ప్రింక్లర్ కావలసిన రైతులు రైతు సేవ కేంద్రాలు సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో విస్తరణ అధికారి రాజు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉమాదేవి అనిమల్ హస్బెండ్ ఏహెచ్ ఏ బాలు నాయక్ గ్రామ పెద్దలు కుళ్లాయి రెడ్డి గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ లలితమ్మ అధ్యతన ఎస్ ఐ ఆర్ సమీక్షా సమావేశం..



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డు అమరావతి నగర్ కాలనీలోని సచివాలయ కార్యాలయములో ఎ ఆర్ ఓ శ్రీమతి రాణి అతిథిగా హాజరైన ఎస్ ఐ ఆర్ పైన సమీక్షా సమావేశం మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ అధ్యతన నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా లలితమ్మ మాట్లాడుతూ పోలింగ్ బూతుల వారిగా తొలగించిన ఓట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.అలాగే గత నెల రోజులుగా ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అధికారులవల్ల, స్థానిక ప్రజలవలన ఎంత వత్తిడి ఉన్న తట్టుకుని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు దగ్గరగా ఓటరు లిస్టును తయారు చేసిన మా సచివాలయం అడ్మిన్ నాగబాబు గారికి వారి సహచరులు హరిప్రసాద్,అపర్ణ, శ్రీరాములు గార్లకు మరియు సూపర్ వైజర్ నిఖిల్ గారికి హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నానని మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ తెలిపారు.ఈ కార్యక్రమములో అమరావతి నగర్ టిడిపి ఇంచార్జీ మహమ్మద్, బిజెపి నాయకులు వెల్లాల మధుసూధనశర్మ, పరుశురాం,రఫీక్ తో పాటుగా అంగన్వాడీ కార్యకర్తలు శ్యామల, శాంతి,మొదలైన వారు పాల్గొన్నారు...

# అంబాపురంలో వర్షాలు కురవాలని గంగమ్మకు పూజలు.



**బేతంచెర్ల జులై 14 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలం నందుగల అంబాపురం గ్రామంలోని రైతులు, గ్రామ ప్రజలు అందరూ కలిసి వర్షాలు కురవాలని, కుల మతాలకు అతీతంగా గంగమ్మకు మంగళవారం నాడు పూజలు నిర్వహించారు.ముందుగా ఉదయాన్నే,గ్రామంలోని గడప గడపకు తిరుగుతూ, కప్పకు పూజలు చేస్తూ, ఊరేగింపు నిర్వహించారు.అనంతరం అంబాపురం గ్రామ శివారులో ఉన్న ఊర కుంట కట్ట మీదున్న గంగమ్మకు, భక్తి శ్రద్దలతో నిర్వాహకులు ఉపవాసాలు ఉండి, గంగమ్మకు పాలాభిషేకం చేసి,బాణం కుండతో పొంగు పాలు పొర్లించి, గంగమ్మ తల్లికి నైవేద్యములు సమర్పించి,కొబ్బరి కాయలు కొట్టి, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం అంబాపురం గ్రామ మంతయూ తిరుగుతూ,ప్రజలకు పాల పాయసం పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పి.రామ మోహన్,సూర్యనారాయణ,మధు శేఖర్,మద్దిలేటి,తిమ్మయ్య,ఎర్రన్న, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి రెండు చోట్ల ఓటు.. క్లారిటీ ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు రెండు వేర్వేరు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో ఉండటంపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇది ఓటర్ల జాబితాలో దొర్లిన సాధారణ సాంకేతిక లోపమేనని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియలో భాగంగా దీనిని సరిదిద్దుతున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక 'ఫ్యాక్ట్‌చెక్ తెలంగాణ' తన 'ఎక్స్' ఖాతాలో ప్రకటన విడుదల చేసింది. కొడంగల్, అచ్చంపేట (కొండారెడ్డిపల్లి) నియోజకవర్గాల ఓటర్ల జాబితాల్లో ముఖ్యమంత్రి పేరు (ఎపిక్ నెం: ౨జూ0274035) ఉన్నప్పటికీ, ఆయన రెండు చోట్ల ఓటు వేసే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత రాక

**కడప బ్యూరో చీఫ్ జూలై 14 నంది పత్రిక** జిల్లాలో ఒక రోజు పర్యటన నిమిత్తం జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత కడపకు విచ్చేశారు. బుధవారం జమ్మలమడుగులోని దాల్మియ సిమ్మెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనుల ప్రారంభోత్సవంలో మంత్రి సవిత పాల్గొననున్నారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. రూ. 3,478 కోట్లతో జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ లైన్-2 ప్లాంట్ విస్తరణ పనులకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. సిమ్మెంట్ పరిశ్రమ విస్తరణ పనుల్లో జిల్లా ఇన్చార్జిమంత్రి సవిత పాల్గొనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం రాత్రి 6.30 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా జమ్మలమడుగుకు చేరుకున్నారు. అక్కడే రాత్రి బస చేశారు. దాల్మియా సిమ్మెంట్ విస్తరణ పనుల శంకుస్థాపన అనంతరం ;ప్రొద్దుటూరుకు చేరుకుని, అక్కడ జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుని, విజయవాడకు మంత్రి సవిత పయనమవుతారని మంత్రి కార్యాలయం ఆ ప్రకటనలో తెలిపింది.



# గ్రామ రెవెన్యూ సహాయకులకు జీతాలు చెల్లించాలి

- నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలి.
- గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డిమాండ్



**కొత్తపల్లి - నంది పత్రిక :** గ్రామ రెవెన్యూ సహాయాకులకు జీతాలు చెల్లించి, డి ఎ లను జీతాల్లో కలపాలని ,నైట్ డ్యూటీలు రద్దుచేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి ఏసురత్నం సిఐటియు కార్యదర్శి రామ్ నాయక్ మండల నాయకులు కలం డిమాండ్ చేశారు వారు మాట్లాడుతూ ప్రభుత్వం వీఆర్ఏల సంఘం నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని వీఆర్వో అటెండర్ వాచ్మెన్ రికార్డ్ అసిస్టెంట్ తదితర ఖాళీ పోస్టుల భర్తీలో 70% వీఆర్ఏలకు కేటాయించాలని అన్నారు రాష్ట్ర విభజన తర్వాత నేటి వరకు వీఆర్ఏలకు జీతాలు పెంచలేదు ముఖ్యమంత్రులతో పాటు రెవెన్యూ మంత్రులు మారారు ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ వీఆర్ఏల జీతం మాత్రం గొర్రె తోక బెత్తెడులా ఉన్నది. గత 10 సంవత్సరాలుగా జీతాలు పెంచలేదు డిఏ ఎత్తివేశారు పని భారం మాత్రం రెట్టింపు చేశారు ఈ కాలంలో పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర సరుకుల ధరలు అనేక రెట్లు పెరిగాయి ప్రభుత్వం ఇస్తున్న 10,500 తో వీఆర్ఏ కుటుంబాలు గడవక పస్తులతో బ్రతుకుతున్నారు గతంలో వైసిపి ప్రభుత్వం వేతనాలు పెంచుతామని మాట ఇచ్చి మాట తప్పారు నేడు రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వీఆర్ఏలకు వేతనాలు పెంచి వారి సమస్యలు పరిష్కరిస్తామని వాగ్దానం చేశారు కానీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిపోతున్న వీఆర్ఏల సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ పెట్టడం లేదు తెలంగాణ లో అమలవుతున్న విధంగా వీఆర్ఏలకు పేస్కేల్ జీతాలు చెల్లించాలని అర్హత ఉన్న వీఆర్ఏలను వన్ టైం సెటిల్మెంట్ ద్వారా విఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలి నిబంధనలకు విరుద్ధంగా విధించిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలి డి ఏ జీతంతో కలపాలి వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న అటెండర్ వాచ్మెన్ రికార్డ్ అసిస్టెంట్ మరియు విఆర్వో కాళీ పోస్టుల భర్తీలో 70% పోస్టులను వీఆర్ఏలు కేటాయించాలని కాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని పై సమస్యల సాధన కోసం జూలై 30వ తేదీన కలెక్టర్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున జిల్లాలోని గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం నాయకులు విజయుడు అమ్మని ముర్తుజా శీను మియ్యసావు లక్ష్మన్న పాల్గొన్నారు.

# సర్ కు ఉరుకులు... పరుగులు



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 14 :** ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక సవరణ కార్యక్రమం అధికారుల గుండెల్లో గుబులు రేపింది. గత జూన్ నెల 15వ తేదీ నుండి సర్ పోగ్రామ్ సంబంధించి సవరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈనెల 14వ తేదీలోగా 100% ఎ న్యుమరేషన్ పూర్తిచేయాలని అధికారులు ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించి బండి ఆత్మకూరు మండలంలో 45 మంది బూతు లెవెల్ అధికారులను నియమించారు. ఎన్నికల కమిషన్ గడువు సమీపిస్తున్న తరుణంలో ఈ విషయంపై అలసత్వం వహిస్తున్న బిఎల్ఓ లపై ప్రత్యేక దృష్టి సారించారు. వీడియో కాన్ఫరెన్స్ లతో ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 12 మంది బూతు లెవెల్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎనిమరేషన్ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్న బిఎల్ఓ లను గుర్తించి తాసిల్దార్ పద్మావతమ్మ గ్రామ సందర్శించి వారిని అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించారు. సోమవారం గ్రామాలను సందర్శించి బూత్ లెవెల్ ఆఫీసర్ల పనితీరును ప్రత్యేకంగా పరిశీలించారు. సోమవారం రాత్రి బండి ఆత్మకూరులో సచివాలయంలోనే తీష్ట వేసి ఎనిమరేషన్ విధానాన్ని పరిశీలించే ప్రక్రియలో మునిగి తేలారు. చాలామంది బిఎల్వోలు సర్ కార్యక్రమంలో అవస్థలు పడ్డారు. గ్రామాలలో నుండి వలసలు వెళ్లినవారు, మరణించిన వారు, అందుబాటులో లేని వారి వివరాలు తెలియక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంలో బిఎల్ఓ లకు బూత్ లెవెల్ ఏజెంట్ల నుండి సహకారం పూర్తిగా కరువైంది. ఈ విషయంపై మొదట్లో ఉత్సాహం చూపిన బూతు లెవెల్ ఏజెంట్లు తర్వాత ఆసక్తి కన పరచక లేకపోయారు. కొందరు నాయకులు మాత్రం సర్ కార్యక్రమానికి తామే అవగాహన కల్పిస్తున్నామన్నా రీతిలో ఫోటోలకు ఫోజులు ఇచ్చి వెళ్లిపోయారు. అయితే మంగళవారం ఉదయం 10 గంటల సమయం నాటికే మండలంలో 100% ప్రత్యేక సవరణ కార్యక్రమం జరిగిందని తహసిల్దార్ పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో ఎన్నికల కమిషన్ మరో పది రోజులపాటు సవరణ కార్యక్రమానికి గడువు పొడిగించింది. నిర్ణీత గడువులోగా ఎనిమరేషన్ పూర్తి చేయాలన్న ఉన్నతాధికారుల ఆంక్షలతో బూతు లెవెల్ అధికారులు ఉరుకులు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బుక్స్ పంపిణి

**ఆళ్లగడ్డ ప్రతినిధి జులై 14, నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం, అహోబిలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు 15 వేల విలువగల డైలీ ప్రోగ్రెస్ రిపోర్టు బుక్స్, అలాగే విజిఎస్ గైడ్స్ ను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ మెటీరియల్స్ ను స్పాన్సర్ చేసిన టూరిస్ట్ సీనియర్ గైడ్ సంజీవ ను పాఠశాల ఉపాధ్యాయులు, వార్డన్ శివకుమారి లు ఘనంగా సత్కారం చేశారు.



# రైతులు పంటల భీమా చేయించుకోవాలి: ఏవో



**మహానంది, జూలై 14 (నంది పత్రిక):-** గ్రామాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంటల భీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.నాగేశ్వర్ రెడ్డి సూచించారు. మంగళవారం మహానంది మండలంలోని బొల్లవరం, తమ్మడపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులు సాగుచేసిన వివిధ పంటలకు రైతు సేవ కేంద్రాల్లో నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ లో పంట బీమా చేయించుకోవాలని, వరి పంటకు ఎకరాకు రూ.800, మొక్కజొన్నకు రూ.660, మినుము పంటకు రూ.190 ప్రీమియం చెల్లించాలని తెలిపారు.వరి పంటకు ప్రీమియం చెల్లించడానికి ఆఖరి తేదీ ఆగస్టు 15 అని, మొక్కజొన్న , మినుము పంటలకు జూలై 31వ తేదీగా ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో బీమా పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని, పంట బీమా కొరకు ఫార్మర్ ఐడి తప్పనిసరి అన్నారు.ఉద్యాన శాఖ అధికారి హరేంద్ర మాట్లాడుతూ.. రైతులు అరటి పంటకు జూలై 31వ తేదీ లోపు ఎకరాకు రూ.2,750 చెల్లించి ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు.అరటి పంటకు వాతావరణ ఆధారిత బీమా పథకం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు , గ్రామ వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, భవ్య శ్రీ, రైతులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇంటి వద్దకే ఉచిత వైద్య సేవలు



**మహానంది, జూలై 14 (నంది పత్రిక):-** ప్రజలకు వారి ఇంటి వద్దకే ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు వైద్య అధికారి డాక్టర్ కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం బసాపురం గ్రామంలోరెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం 'మీ ఇంటికి- మీ డాక్టర్" కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రజలకి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ..ఇంటింటికీ వైద్య సేవలందించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన మొబైల్ మెడికల్ యూనిట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కమలాకర్ నాయుడు, మదన శేఖర్, సిబ్బంది పావని, సుజీతా, సుధాకర్ పాల్గొన్నారు.

# నూతన ఏఎస్పీ సుస్మితనుకలిసిన మహానంది ఎస్సై





**మహానంది, జూలై 14(నంది పత్రిక):-** నంద్యాల జిల్లా నూతన ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సుస్మిత ఐపీఎస్ ను మహానంది ఎస్సై ఎన్.రామ్మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎస్పీ కార్యాలయంలో ఆమెను కలిసి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అంతకు ముందుగా మహానంది దేవస్థానం వేదపండితులు రవిశంకర్ అవధాని, హనుమంతు శర్మ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి,తీర్థప్రసాదాలు,వేద ఆశీర్వచనం అందజేశారు.

# వేరుశనగలో విత్తన శుద్ధి




**రుద్రవరం ప్రతినిధి జులై 14 (నంది పత్రిక):** రైతు సాగు చేస్తున్న వేరుశనగ లో మండల వ్యవసాయ అధికారి సుమతి సోమవారం విత్తన శుద్ధి చేశారు. ఎన్ఎంఈఓఎస్ - ఓఎస్ పథకంలో భాగంగా వేరుశనగ పంట సాగుకు సంబంధించి రుద్రవరం మండలానికి రెండు యూనిట్లు వేరుశనగ విత్తనాలు మంజూరు అయినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. వేరుశెనగ కాయలు తీసుకున్న రుద్రవరం గ్రామానికి చెందిన మనోహర్ అనే రైతు పొలంలో ట్రైకోడెర్మా విరిడి కేజీ విత్తనానికి 10 గ్రాముల చొప్పున విత్తన శుద్ధి చేసి పొలంలో విత్తన వేయడం జరిగిందని వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు ఉన్నారు.

# కరెంటు స్తంభం పైన 12 కేజీల భారీ ఉడుము.

**నంది పత్రిక ఆత్మకూరు..** సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ వారి ద్వారా అడవి లో వదలడం జరిగింది. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కరివేన గ్రామండిపాల్ హై స్కూల్ దగ్గర 340 ఎన్ హెచ్ హైవే దాటుకుని హ్యాపీ హోమ్ కాలనీలోకి చొరబడి అడవి నుండి వచ్చిన 12 కేజీల పెద్ద ఉడుము ఎటు వెళ్లాలను దిక్కుతోచక కరెంటు స్తంభం చివరిదాకా ఎక్కి కూర్చొని ఉన్నది కాలినివాసులు గమనించి సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ వారికి సమాచారం ఇచ్చినారు వారు వెంటనే అక్కడికి చేరుకుని నానా అవస్థలు పడి ఆ పెద్ద ఉడుమును సురక్షితంగా పట్టుకొని అడవిలో వదలడం జరిగింది ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ ఇస్మాయిల్ అతని సహచరుడు పాల్గొన్నారు వీరికి హ్యాపీ హోమ్ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు





# బాల్య వివాహాలు చట్టరీత్య నేరం



**మహానంది జూలై 14 (నంది పత్రిక):-** బాల్య వివాహాలు చేయడం చట్టరీత్య నేరమని ఐసీడీఎస్ సూపర్వైజర్ తోట కవిత పేర్కొన్నారు.మంగళవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటి బచావోబేటి పడావో, బాల్య వివాహాలు, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్ పై ఈగల్, శక్తి టీం సభ్యులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మత్తు పదార్థాలు, పొగాకు వాడకం వల్ల మెదడు పనితీరు ఎలా దెబ్బతింటుందో వివరించారు. పొగాకు వల్ల కలిగే ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల విద్యార్థులను అప్రమత్తం చేశారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతోనో లేదా స్నేహితుల ఒత్తిడితోనో అలవాటు చేసుకునే చిన్న వ్యసనం జీవితాన్నే నాశనం చేస్తుందని హెచ్చరించారు.మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, ఇది వారి ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పని స్పష్టం చేశారు. మైనర్ డ్రైవింగ్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించరాదన్నారు.చట్టాన్ని ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 'శక్తి యాప్' డౌన్లోడ్ చేసుకుంటే మహిళలకు రక్షణ కవచంగా ఉంటుందని పేర్కొన్నారు.శక్తి యాప్ యొక్క ప్రాముఖ్యత ప్రయోజనాలను వివరించారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,ఇటీవలి కాలంలో సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు సరికొత్త పద్ధతుల్లో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సామాజిక మధ్యమ లో వచ్చే ఎలాంటి లింకులు గానీ డౌన్లోడ్,షేర్ చేయడం వంటివి చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి,నంద్యాల శక్తి, ఈగల్ టీం సభ్యులు డివన్ ప్రసాద్, వెంకటేశ్వర్లు,లక్ష్మి దేవి, మనోహర్, అంగన్వాడి కార్యకర్తలు లక్ష్మీనారాయణమ్మ, మహేశ్వరి, కొండమ్మ పాల్గొన్నారు.



# వర్షం కోసం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసిన గ్రామస్తులు.



**జూపాడు బంగ్లా: జూలై: 14: (నంది పత్రిక)** మండల పరిధిలోని భాస్కరపురం గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి బాగా పండాలని ఆకాంక్షిస్తూ భక్తులు శ్రీ ఆంజనేయ స్వామికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో జలాభిషేకం వర్ష దేవత కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పవిత్ర ఆకులతో విశేష అలంకరణ చేసి, ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వర్షాలు సమృద్ధిగా కృషి రైతాంగలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలు కలగాలని ప్రార్థించారు. భాస్కాపురం గ్రామంలో మంగళవారం అమావాస్య కావడంతో గ్రామస్తులు వర్షం కోసం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లోనే సాగుచేసిన పంటలకు వర్షాలు సరిగా కురవకపోవడంతో భూమిలో ఆరిపోయి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. వర్షా బావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్న నేపథ్యంలో పంటలను కాపాడాలని, చెరువులు కాలువలు నిండాలని, వ్యవసాయం సుభిక్షితముగా సాగాలని శ్రీ ఆంజనేయ స్వామిని వేడుకున్నారు. రైతంగం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ ప్రత్యేక ఆకు పూజను నిర్వహించారు. రైతులు మొక్కజొన్న,కంది,పత్తి,మిరప తదితర పంటలను సాగుచేసి వర్షం కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. అయితే మంగళవారం గ్రామ పెద్దలు, రైతులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ఆకులతో ప్రత్యేక అలంకరణ చేసి హారతులు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కృషి పంటలు బాగా పండాలని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని దేవుని వేడుకున్నారు. శ్రీ ఆంజనేయ స్వామికి జలాభిషేకం, 108 తమలపాకులచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాటంలక్ష్మీ దేవమ్మ, కాటంరామిరెడ్డి, కాటం కౌశల్య, కాటం శృతి, జి వెంకటేశ్వర్లు, జి గోవిందు, కురువ పెద్ద రాముడు, కుమ్మరి పెద్ద రాముడు, మాజీ గ్రామ సర్పంచ్ మాధవి, సోమన్న, గ్రామ పెద్దలు మహిళలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థోపెడిక్ ప్రభుత్వ వైద్యుడిగా పేరూరు వాసి ఎంపిక.



**రుద్రవరం ప్రతినిధి జులై 14 (నంది పత్రిక):** రుద్రవరం మండలం పేరూరు గ్రామానికి చెందిన సన్నల బాలిరెడ్డి, సుభద్రమ్మ దంపతుల కుమారుడు డా. సన్నల వంశీకృష్ణారెడ్డి ప్రభుత్వ ఆర్థోపెడిక్ వైద్యుడిగా జార్ఖండ్ రాష్ట్రానికి ఎంపికయ్యారు. వంశీకృష్ణారెడ్డి కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, అనంతరం ఎంఎస్ ( ఎమ్మెస్) ఆర్థోపెడిక్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. తాజాగా జార్ఖండ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఆర్థోపెడిక్ వైద్యుడిగా ఎంపిక కావడంతో ఆయన అక్కడ ప్రజలకు వైద్య సేవలు అందించనున్నారు. తన కుమారుడు ఈ ఘనత సాధించడం పట్ల తల్లిదండ్రులు సన్నల బాలిరెడ్డి, సుభద్రమ్మ ఆనందం వ్యక్తం చేశారు. వంశీకృష్ణారెడ్డి కుటుంబంలో వైద్య వృత్తిలో కొనసాగుతున్న వారు మరికొందరు ఉండడం విశేషం. ఆయన అక్క డా. నందిని రెడ్డి, చెల్లి డా. అఖిల రెడ్డి కూడా వైద్యులుగా సేవలందిస్తున్నారు.

## పదోన్నతి పొందిన ఎక్సైజ్ అధికారులకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఘన సన్మానం

### పదోన్నతి ఆర్డర్లు అందజేసిన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య




**నందికొట్కూరు జూలై 14(నంది పత్రిక )** నందికొట్కూరు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పదోన్నతులు పొందిన అధికారులకు ఎక్సైజ్ కార్యాలయం నందు మంగళవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నందికొట్కూరు ఎక్సైజ్ ఎస్ఐగా పనిచేస్తూ డోన్ ఎక్సైజ్ సీఐగా పదోన్నతి పొందిన జఫరుల్లా, అలాగే హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ కోడుమూరు ఎక్సైజ్ ఎస్ఐగా పదోన్నతి పొందిన కృపవర కుమారి లకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పదోన్నతి ఆర్డర్లను అందజేశారు. అనంతరం శాలువాలు కప్పి, పూల బొకేలు అందించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఎక్సైజ్ ఎస్సై జఫరుల్లా సీఐగా , కృపవర కుమారి హెడ్ కానిస్టేబుల్ నుండి ఎస్సైగా పదోన్నతి పొందిన వీరు ఇరువురికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కొత్త బాధ్యతల్లోనూ సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వానికి, శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు, మండల అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం శర్మ, ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు, హెడ్ కానిస్టేబుళ్లు పద్మనాభం, శేఖరయ్య నాయకుడు, కానిస్టేబుళ్లు శివన్న, సుధీర్ కుమార్, మధుసూధన్ ప్రసాద్, ఇతర అధికారులు, స్థానిక నాయకులు పాల్గొని పదోన్నతి పొందిన అధికారులను అభినందించారు.

## జులై 19న చలో నంద్యాలకు రిజర్వేషన్ల పరిరక్షణ సమితి పిలుపు.



**వెలుగోడు జులై 14 మంది పత్రిక:** జులై 19 న బహుజన ఉద్యోగుల న్యాయభేరి సమావేశం కొరకు చలో నంద్యాల అని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి నాయకులు పిలుపునిచ్చారు. వెలుగోడు లోని విద్యుత్ కార్యాలయం వద్ద వాల్ పోస్టర్ల విడుదల చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో లిఖించిన అంశాలు అమలు చెయ్యాలని, రాజ్యాంగ పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ చట్టసభలలో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు, న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు అమలు చేయాలని,, ప్రభుత్వ ఉద్యోగ చట్టం అమలు చేయాలని గ్రేటర్ రాయలసీమ పరిధిలో గిరిజనులకు 5 ఎమ్మెల్యే రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలని, విద్యా వైద్య రంగాలలో సమాన అవకాశాలు కల్పించాలని, బహుజనులకు అన్ని రంగాలలో జనాభా ధమాషా ప్రకారం వాటా కేటాయింపులు జరగాలని జూలై 19న నంద్యాల జిల్లా కేంద్రంలోని గోడెన్ ఫంక్షన్ హాల్ నందు జరిగే బహుజన ఉద్యోగుల న్యాయభేరి సభకు బహుజనవాదులు, న్యాయవాదులు, ఉద్యోగులు ,చార్టెడ్ అకౌంటెంట్స్, వివిధ వృత్తుల వారు పాల్గొని విజయవంతం చేయాలని రిజర్వేషన్లు ప్రదక్షిణ సమితి నాయకులు రిజర్వేషన్ల రిజర్వేషన్ల పరిరక్షణ సమితి నాయకులు రఘు రాముడు ఆధ్వర్యంలో , వెలుగోడు బండి ఆత్మకూరు పట్టణాలలో కరపత్రాలు మరియు గోడ పత్రికలు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి రిజర్వేషన్ల పరిరక్షణ సమితి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు పెరుగు శివకృష్ణ, జిల్లా అధ్యక్షులు బిజినవేముల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా సురేష్, రామయ్య, ఆర్పిఎస్ నాయకులు జాల రామ్మోహన్, న్యాయవాది అబ్దుల్ ఖాదర్, మధు, సత్యం ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ పద్మనాభం మృతి రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటు: పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

**పోరుమామిళ్ల, జూలై 14: ( నంది పత్రిక )** హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి చెందడం అత్యంత బాధాకరమని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముద్రగడ పద్మనాభం నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు పార్లమెంట్ సభ్యునిగా ప్రజలకు విశిష్ట సేవలు అందించారని అన్నారు. గత కొంతకాలంగా హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్న సమయంలో గుండెపోటుతో ఆయన మరణించడం రాష్ట్ర రాజకీయాలకు, ముఖ్యంగా వైఎస్సార్సీపీకి తీరని లోటని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితమే తాను సింధు ఆసుపత్రికి వెళ్లి, ఐసీయూలో చికిత్స పొందుతున్న ముద్రగడ పద్మనాభాన్ని ప్రత్యక్షంగా కలవలేక ఆయన కుమారుడిని కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ఆ సమయంలో వెంటిలేటర్ తొలగించారని, ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతూ కొద్దిగా మాట్లాడుతున్నారని ఆయన కుమారుడు తెలిపినట్లు గుర్తు చేశారు. మాటకు కట్టుబడి నిలబడే నాయకుడిగా ముద్రగడ పద్మనాభం ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. తన పేరు కూడా పద్మనాభ రెడ్డిగా మార్చుకుని తన నమ్మకాల పట్ల నిబద్ధతను చాటుకున్నారని పేర్కొన్నారు. కాపు సామాజిక వర్గ హక్కుల కోసం నిరంతరం ఉద్యమాలు చేసిన ప్రముఖ నాయకుల్లో ఆయన ముందువరుసలో నిలిచారని చెప్పారు. ఉద్యమం కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, తన రాజకీయ భవిష్యత్తును సైతం పక్కనపెట్టి సిద్ధాంతాల కోసం పోరాడిన అరుదైన నాయకుడని కొనియాడారు. ముద్రగడ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. వారి కుటుంబానికి వైఎస్సార్సీపీ అండగా ఉంటుందని తెలిపారు.



## జానాలగూడెం చెంచు గ్రామాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ

### - సునీల్ షోరాన్ ఐపీఎస్



**కొత్తపల్లి – నంది పత్రిక** : మండలంలోని జనాల గూడెం చెంచు గ్రామాన్ని స్వయంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ సందర్శించారు గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం మాట్లాడుతూ గ్రామంలో ఐకమత్య వాతావరణాన్ని కొనసాగిస్తూ ఎలాంటి గొడవలు, వివాదాలకు తావు ఇవ్వకుండా పరస్పర సహకారంతో జీవించాలని సూచించారు. అలాగే పిల్లలకు విద్యను అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ప్రతి కుటుంబం కృషి చేయాలని అవగాహన కల్పించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే జిల్లా పోలీసు శాఖ యొక్క అత్యున్నత ప్రాధాన్యత. ప్రజలకు పోలీసు సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందానిన్నారు



## అర్హత కలిగిన ప్రతి ఓటర్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నమోదు చేసుకునేలా చూడాలి : ఏబీయం పాలెం టిడిపి నాయకులు.

### ఏబీయం పాలెంలో వార్డులు 80, 81, 82లో ప్రక్రియ వేగవంతం



**నందికొట్కూరు, జూలై 14( నంది పత్రిక )** స్వర్ణ వార్డు వన్ సచివాలయ పరిధిలో అర్హత కలిగిన ప్రతి ఓటర్ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా అవగాహనతో కూడిన అవకాశం కల్పిస్తూ , ఎలాంటి తప్పులు లేకుండా ఆన్లైన్ డిజిటలైజేషన్ చేయాలని ఏబీయం పాలెం టీడీపీ సీనియర్ నాయకులు నిమ్మకాయల మోహన్, ఒకటో వార్డ్ మాజీ కౌన్సిలర్ కే.చిన్న రాజు, టిడిపి నాయకులు కే నాగ సురేష్ సచివాలయం నందు బి ఎల్ ఓ లకు సూచించారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని 80, 81, 82 వార్డుల పరిధిలోని బూత్ లెవల్ అధికారులతో ఏబీయం పాలెం టిడిపి నాయకులు సర్ ( ఎస్ ఐ ఆర్ )ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా డిజిటలైజ్ చేయాలని సూచించడంతో పాటు, మిగిలిన ఫారాలను బి ఎల్ ఓ ల సహకారంతో పూర్తి చేయించారు. ఈ సందర్భంగా సర్( ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, పెండింగ్ లేకుండా అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. ప్రభు, కె. జాన్సన్, పండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీలో రాణించాలి

### కరాటే విద్యార్థులను అభినందించిన బిసి రాజారెడ్డి

### జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

**బనగానపల్లె జులై 14నందిపత్రిక** బనగానపల్లె జెన్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రాణించాలని పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి ఆశభావం వ్యక్తం చేశారు . కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఇటీవల తిరుపతిలోని శ్రీ గాంధం శ్రీధరకృష్ణారెడ్డి భవన్, బాత్రిపేటలో నిర్వహించిన 6వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ మరియు కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (కేఏ ఐ ) నేషనల్ సెలెక్షన్స్2026 పోటీలు నిర్వహించారు. పోటీలలో బనగానపల్లెకు చెందిన జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బిసి రాజారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుండి వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్న పోటీలలో రాణించిన వారిని, ఆగస్టు 7, 8, 9 తేదీలలో పశ్చిమ బెంగాల్‌లో జరిగే కేఏ ఐ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్2026కు ఆంధ్రప్రదేశ్ జట్టును ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. అందులో బనగానపల్లెకు చెందిన జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు 12 మంది వ్యక్తిగత విభాగాల్లో మరియు ఒక జూనియర్ టీమ్ కటా విభాగంలో జాతీయ స్థాయికి అర్హత సాధించడం గర్వించదగ్గ విషయం అన్నారు. కుమిటే విభాగంలోఎన్. నిహార,ఏ. శ్రీతేజ, డి. శ్రీదిత్య, ఎం. హేమలత, ఏ. నాగసాత్విక్ శర్మ, టి. కృష్ణమోహన్, డి. యశ్వంత్,టి. తారక, ఎన్. సాయిరితేష్ , ఈ. నాగ తారక రామ్ గౌడ్ , కె. సాయిచరణ్ తేజ విజేతలుగా నిలిచి స్వర్ణ పతకాలు సాధించడం అభినందనీయం అన్నారు. అలాగే కటా బనగానపల్లె విభాగంలో కె. సాయిచరణ్ తేజ కాంస్య పతకం, టీమ్ కటా విభాగంలో కె. సాయిచరణ్ తేజ, ఈ. నాగతారకం గౌడ్, పి.వి. మహీధర్, ఎన్. సాయిరితేష్, ఎస్.ఎం. ముజామిల్, టి. తారక్ లు స్వర్ణ పతకం, కాడెట్స్ విభాగంలో సీహెచ్. మనోరంజిత్, ఏ. మహీధర, ఏ.ధనుష్ లు కాంస్య పతకం, సబ్ జూనియర్స్ విభాగంలో డి. యశ్వంత్, ఏ. నాగసాత్విక్ శర్మ, టి.కృష్ణమోహన్ లు కాంస్య పతకం, సబ్ జూనియర్ బాలికల విభాగంలో డి. శ్రీదిత్య, ఎన్. నిహార, ఏ. శ్రీతేజు లు కాంస్య పతకం, కటా లో ఎన్. నిహార కాంస్య పతకం, డి. శ్రీదిత్య రజత పతకం సాధించినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. అకాడమీ కోచెస్ అయినటువంటి డి. కళ్యాణ్ బాబు , ఎం.సూర్య వంశీ , ఎం.చైతన్య రెడ్డి , ఎం.అనిల్ కుమార్ గారిని ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.





## ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు: నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు - ఏడీఏ సునీత



**నందిపత్రిక –ప్యాపిలి** రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించినా డీలర్లపై కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏ డి ఏ సునీత, మండల వ్యవసాయ అధికారి రాజేష్ హెచ్చరించారు. మంగళవారం కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ సీడ్స్ దుకాణాలపై వారు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను, నిల్వ ఉన్న ఎరువుల వివరాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. దుకాణాల వెలుపల తప్పనిసరిగా ధరల పట్టికను ప్రదర్శించాలని డీలర్లను ఆదేశించారు.

**ఈ సందర్భంగా ఏడీఏ సునీత మాట్లాడుతూ..** “ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ విక్రయానికి రైతులకు ఖచ్చితంగా జీఎస్టీ తో కూడిన రసీదులు అందించాలి. ఏ దుకాణదారుడైనా నిల్వలను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం“ అని హెచ్చరించారు.రైతులు తాము కొనుగోలు చేసే ప్రతి విత్తన బస్తా ఎరువుల బస్తాకు సంబంధించిన రసీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. అనధికారికంగా, పత్రాలు లేకుండా ఎవరైనా విక్రయాలు జరిపితే తమకు సమాచారం అందించాలని కోరారు. దుకాణాల్లో అనుమతి పొందిన బ్రాండ్లు మాత్రమే విక్రయించాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది స్థానిక ఫర్టిలైజర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## యాగంటి ఆలయ హుండీ లెక్కింపు



**బనగానపల్లె జులై 14నందిపత్రిక** దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో మంగళవారం యాగంటి ఆలయ హుండీ లెక్కింపు జరిగింది.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ ఉన్నతాధికారి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా నిర్వహించారు.ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి,ఆలయ చైర్మన్ బండి మౌళేశ్వర రెడ్డి ఈ లెక్కింపును దగ్గరుండి కట్టుదిట్టంగా పర్యవేక్షించారు.ముందుగా ఆలయం ప్రాంగణంలో హుండీలన్నింటినీ అధికారులు నిబంధనల ప్రకారం తెరిచారు.వీరే కాకుండా పర్యవేక్షకులు,ఆలయ సిబ్బంది, పోలీసు అధికారులతో కలిసి కమిటీ సభ్యులు ఈ లెక్కింపు కార్యక్రమంలో చురుగ్గా పాలుపంచుకున్నారు.పురుషులు తప్పనిసరిగా పంచె,బనీయన్ వంటి సాంప్రదాయ దుస్తులు ధరించాలనే నియమం ఉంది.ఈ సందర్బంగా అసిస్టెంట్ కమిషనర్ పాండురంగా రెడ్డి మాట్లాడుతూ లెక్కింపులో 109 రోజులకు గాను ఏకంగా రూ.33,29,573/- నగదు ఆదాయంగా లభించింది.ఈ నగదుతో పాటు 1 గ్రాము బంగారం ఆభరణాలు,70 గ్రాములు వెండి ఆభరణాలను భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో హుండీలో వేశారని ఆలయ అధికారులు వివరించారు .ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు తిరుమలయ్య, రామశేఖర్,గోపినాథ్,సురేష్, భరతుడు,శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



## వర్షాల కోసం ప్యాపిలిలో ప్రత్యేక పూజలు! బొడ్రాళ్లకు జలాభిషేకం, దర్గాలో ప్రార్థనలు



**నందిపత్రిక –ప్యాపిలి** మండలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ ప్యాపిలి పట్టణంలో మంగళవారం రైతులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరుణ దేవుని కరుణ కోసం హిందూ, ముస్లింలు ఏకమై భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాలను చేపట్టడం విశేషం.పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్రతిష్టించిన బొడ్రాళ్లకు రైతులు సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ బొడ్రాళ్లకు 11 బిందెల చొప్పున నీటితో జలాభిషేకం చేశారు. అనంతరం స్థానిక ప్రసిద్ధ హజరత్ బందేనవాజ్ పీర్ల దర్గాకు చేరుకుని అక్కడ ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి, పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని దైవాన్ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అంతుబోని రమేష్, గుజ్జల అశోక్,చంద్ర స్థానిక రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీ అవధూత కాశినాయన మండలానికి వెంటనే శాశ్వత తహసీల్దార్‌ను నియమించాలి:

### హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు



**కాశినాయన జూలై 14 (నంది పత్రిక)**వైఎస్సార్ కడప జిల్లా శ్రీ అవధూత కాశినాయన మండలానికి వెంటనే శాశ్వత (పర్మినెంట్) తహసీల్దార్‌ను నియమించాలని హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. మండలంలో శాశ్వత తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి అధికారులు సక్రమంగా రావడం లేదని, ఫోన్ ద్వారా సంప్రదించినా స్పందించడం లేదని మండల ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. దూర ప్రాంత గ్రామాల నుంచి వివిధ రెవెన్యూ పనుల కోసం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు తహసీల్దార్ అందుబాటులో లేక నిరాశతో వెనుదిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఎప్పుడు కార్యాలయంలో ఉంటారో తెలియక ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, మండల కేంద్రంలో కనీస భోజన సౌకర్యాలు కూడా లేక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తహసీల్దార్ అప్పుడప్పుడు మాత్రమే కార్యాలయానికి వచ్చి వెళ్లిపోతున్నారని, దీంతో ఆదాయ, భూ, ధృవపత్రాలు తదితర రెవెన్యూ సేవలు ఆలస్యమవుతున్నాయని అన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి శ్రీ అవధూత కాశినాయన మండలానికి శాశ్వత తహసీల్దార్‌ను నియమించి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు.

## నూతన జిల్లా ఇంచార్జ్ తొలి పర్యటన.. పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం



**నంది పత్రిక ఆత్మకూరు..** ఆత్మకూరు: నూతనంగా నియమితులైన శ్రీశైలం నియోజకవర్గ జిల్లా ఇంచార్జ్ పార్థసారథి రెడ్డి తొలిసారిగా శ్రీశైలం నియోజకవర్గాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, నూతన కో-ఇంచార్జ్ కాశి విశ్వనాథ్ పాల్గొన్నారు. ముందుగా శ్రీశైలం అసెంబ్లీ పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఇందులో భాగంగా "అమ్మ పేరుతో ఒక చెట్టు" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా మొక్కను నాటారు. అనంతరం కార్యాలయంలో దీూూ-2 సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనే వ్యూహాలపై, పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే అంశాలపై మండల అధ్యక్షులు, నాయకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అలాగే బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని, ప్రతి కార్యకర్త ప్రజల్లో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం శ్రీశైలం అసెంబ్లీ ఇంచార్జ్ మోమిన్ షబానా ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది. పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, దీూూ-2లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





**భీమవరం బ్యూరో చీఫ్ జూలై 14 నంది పత్రిక** కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో పేదల గృహ నిర్మాణాల ప్రగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఏఈలు, డిఈలు, కాంట్రాక్టర్లతో మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ ప్రగతిలో రాష్ట్రంలో మన జిల్లా 4వ స్థానంలో ఉన్నామన్నారు. జిల్లాలో 50, 611 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 36,395 నిర్మాణాలు పూర్తయ్యాయని, ఇంకను 14,216 నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గత సమీక్ష సమావేశం నుండి ఈరోజు వరకు కేవలం 259 గృహాలు మాత్రమే పూర్తి చేశారని మిగిలిన గృహాలు సత్వరమే పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.ఆప్షన్ త్రీ గృహ నిర్మాణాలలో 5142 ఇళ్లు పూర్తి చేయవలసి ఉండగా 403 ఇళ్ల మాత్రమే పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వచ్చే సమీక్ష సమావేశం నాటికి గృహ నిర్మాణాలపై మంచి ప్రగతి చూపించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారి జి. పిచ్చయ్య జిల్లాలోని డిఈ లు, ఏఈలు, గృహ నిర్మాణ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు,

## లండన్‌లో 'హల్దీరామ్స్' హంగామా... తొలి అవుట్ లెట్ ముందు భారీ క్యూలైన్లు

భారతదేశంలో స్నాక్స్, స్వీట్లకు ప్రసిద్ధి చెందిన ప్రముఖ బ్రాండ్ 'హల్దీరామ్స్' ఇప్పుడు లండన్ వాసులను పలకరించింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో తన మొట్టమొదటి అవుట్‌లెట్‌ను లండన్‌లోని ప్రఖ్యాత లీసెస్టర్ స్క్వేర్‌లో ప్రారంభించింది. ఈ వార్త తెలియగానే, అక్కడి ప్రవాస భారతీయులు భారీ సంఖ్యలో స్టోర్‌కు పోటెత్తారు. దీంతో స్టోర్ బయట కిలోమీటర్ల మేర క్యూలైన్లు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'జఱవషం.షవ.వ×జూశ్రీశీతీవ' అనే ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన వీడియోలో, భారతీయులు ఎంతో ఓపికగా క్యూలో నిలబడి ఉండటం కనిపిస్తుంది. 'ఈ వారాంతంలో ప్రతి దేశీ ప్లాన్ ఇదేనేమో' అనే వ్యాఖ్యతో ఈ వీడియో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తమ స్టోర్‌కు లభించిన అపూర్వ స్పందనపై హల్దీరామ్స్ కూడా స్పందించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో "ఢిల్లీ పిలిచింది... లీసెస్టర్ స్క్వేర్ సమాధానమిచ్చింది" అంటూ ఆసక్తికరమైన వ్యాఖ్యను పోస్ట్ చేసింది.

1937లో రాజస్థాన్‌లోని బికనీర్‌లో ప్రారంభమైన హల్దీరామ్స్, దశాబ్దాలుగా భారతీయుల ఆదరాభిమానాలను చూరగొంటోంది. ఇప్పుడు యూకేలో తొలిసారిగా రెస్టారెంట్ తరహాలో స్టోర్ తెరవడంతో, లండన్‌లోని ప్రవాస భారతీయులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను, భారతీయ రుచులను గుర్తుచేసుకుంటున్నారు. ముఖ్యంగా చాట్, సమోసాలు, జిలేబీ, రసమలయ్ వంటి స్వీట్లు, థాలీల కోసం అక్కడి వారు లొట్టలు వేస్తున్నారు.

ఈ పరిణామంపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. భారతీయులు ఇంత క్రమశిక్షణతో క్యూలో నిల్చోవడం చూసి కొందరు సరదాగా వ్యాఖ్యానిస్తుండగా, హల్దీరామ్స్ ఉత్పత్తులు ఇప్పటికే అక్కడి ఇండియన్ స్టోర్స్‌లో దొరుకుతున్నాయని, దీనికి ఇంత హైప్ అవసరం లేదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా, విదేశీ గడ్డపై ఒక భారతీయ బ్రాండ్‌కు ఇంతటి ఆదరణ లభించడం పట్ల ఎక్కువ మంది గర్వంగా ఫీలవుతున్నారు. భారతీయ ఆహారానికి ఉన్న ప్రపంచవ్యాప్త ఆదరణకు ఈ సంఘటనే నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# జిల్లాలో 10,055 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువులు నిల్వ ఉన్నాయి.



### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ జూలై 14 నంది పత్రిక**జిల్లాలో ఖరీఫ్ సీజన్లో వరి పండించే రైతులకు అవసరమైన యూరియా ఎరువు అందుబాటులో ఉన్నదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో ని రైతులకు అవసరమైన ఎరువుల లభ్యత, వాటి సరఫరాకు సంబంధించి మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా 2,25,000 ఎకరాలలో వరి పంట సాగు చేయటం జరుగుతుందని అన్నారు. దీనికి అనుగుణంగా 25,000 ఎకరాలలో ఉద్యాన పంటలు సాగు చేయటం జరుగుచున్నదని అన్నారు. ఖరీఫ్ సీజన్ అయినా ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు జిల్లాకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ విషయమై రైతులు ఎవరు ఆందోళన చందవలసిన అవసరం లేదని అన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు 17392 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉన్నప్పటికీ, ఇప్పటివరకు 3322 మెట్రిక్ టన్నులు అమ్మకాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఇంకను జిల్లాలో 10055 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయని అన్నారు. జిల్లాలో ఖరీఫ్ కాలానికి 1530 మెట్రిక్ టన్నుల డిఎపి అవసరం కాగా, ఇప్పటివరకు 978 బిటెక్ టన్నులు అమ్మకాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఇంకనూ 2722 మెట్రిక్ టన్నులు నిల్వ ఉందని అన్నారు. ఖరీఫ్ కాలానికి 16121 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ అవసరం కాగా ఇప్పటివరకు 2792 మెట్టన్నుల అమ్మకాలు జరిగాయని, ఇంకను 16163 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయని అన్నారు. ఖరీఫ్ కాలానికి 8626 మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులు అవసరం కాగా ఇప్పటివరకు 896 మెట్రిక్ టన్నులు అమ్మకాలు జరిగాయని, ఇంకను 2302 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయని అన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా ఎరువుల కొరత లేదని అన్నారు. ఎరువుల డీలర్లు ఎవరైనా అవకతవకలకు పాల్పడితే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లను చేయడం జరిగిందని అన్నారు. ఇప్పటివరకు నిబంధనలు ఉల్లంఘించిన 20 మంది హోల్ సేల్, రిటైల్ డీలర్ల లైసెన్సులు సస్పెండ్ చేయటం జరిగిందని అన్నారు. అంతేకాక నిబంధనలు ఉల్లంఘించిన టాప్ 20 యూరియా లిస్టులో వచ్చిన డీలర్ల పైన కూడా చట్టపరమైన చర్యలు తీసుకొని జరిమానాలు విధించడం జరిగిందని అన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో బృందాలుగా ఏర్పడి ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో బోర్డర్ ఉన్న గ్రామాల వద్ద కూడా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. గత ఖరీఫ్ 2025 కాలానికి ఈ పంట చేయించుకున్న రైతులందరి వివరాలను యాప్ లో నమోదు చేయడం జరిగిందని అన్నారు. వివరాలు నమోదు కాని రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలలో నమోదు చేయించుకోవచ్చని అన్నారు. ప్రస్తుతం యూరియా, డిఎపి ఎరువులను మాత్రమే పంపిణీ చేయడం జరుగుచున్నదని అన్నారు. కౌలు రైతులు కూడా సాగు వివరాలను నమోదు చేయించుకోవచ్చని అన్నారు. జిల్లాలో ఎప్పటి వరకు 27292 రైతులకు 74817 యూరియా బస్తాలు, 6978 డిఎపి బస్తాలు అమ్మకాలు జరిగాయని అన్నారు. పాత్రికేయుల సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్. వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## కేజీబీవీలో 'బేటీ బచావో బేటీ పడావో' అవగాహన సదస్సు



**వెలుగోడు, జూలై 14 (నంది పత్రిక):** బాలికల రక్షణ, విద్యాభివృద్ధి, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా వెలుగోడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మంగళవారం 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెలుగోడు ఎస్ఐ బి. సురేష్ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ, బాలికల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. బాలికలు నిర్భయంగా చదువుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఎలాంటి ఆపద ఎదురైనా వెంటనే పోలీసు శాఖ లేదా చైల్డ్‌లైన్‌ను ఆశ్రయించాలని సూచించారు.సదస్సులో భాగంగా బాలికల విద్య ప్రాముఖ్యత, ఆత్మరక్షణ నైపుణ్యాల అవసరం, మహిళల భద్రత కోసం రూపొందించిన 'శక్తి (దిశ)' మొబైల్ యాప్ వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే బాల్యవివాహాల నివారణ, చైల్డ్‌లైన్ 1098, మహిళా సంక్షేమ సేవలు, అత్యవసర స్పందన వ్యవస్థలపై సమగ్ర వివరాలు అందించారు.బాలికలు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ధైర్యంగా ముందుకు సాగాలని, విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానాన్ని చేరుకోవచ్చని వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయలక్ష్మి, వినోలియా, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయినులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమిపాలన : ఎమ్మెల్యే గిత్త జయసూర్య.




**నందికొట్కూరు జూలై 14 ( నంది పత్రిక)** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రోడ్ల నిర్మాణాలు, స్వచ్ఛత కార్యక్రమాలతో పాటుగా రైతన్నలకు అనేక ప్రోత్సాహకర అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ముందుకెళ్లడం జరుగుతుందని, గత ప్రభుత్వంలో కన్నా మునిపెన్నడు లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే గిత్త జయ సూర్య పేర్కొన్నారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయం నందు మండల అధ్యక్షుడు మురళి కృష్ణారెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరయ్యారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసులు, సిడిపిఓ మంగవలి, ఏవో షేక్షావలి, మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కడప ఎయిర్పోర్టులో మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం

### స్వాగతం పలికిన మంత్రి సవిత

### జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ- ఎమ్మెల్యేలు టిడిపి నాయకులు





**కడప బ్యూరో చీఫ్ జూలై 14 నంది పత్రిక** జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండలం, చిన్నకోమెర్ల గ్రామం వద్ద గల దాల్మియా సిమెంట్ కర్మగారం రెండవ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర విద్యా, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కు కడప ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం పలికిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు. మంత్రి నారా లోకేష్ కు స్వాగతం పలికిన వారిలో జిల్లా ఇంఛార్జి మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్ పి షేల్కే సచికేత విశ్వనాద్, కడప, ప్రొద్దుటూరు శాసన సభ్యులు రెడ్డెప్పగారి మాధవి రెడ్డి, నంద్యాల వరదరాజుల రెడ్డి, డిసిసి బ్యాంకు చైర్మన్ శ్రీ సూర్య నారాయణ రెడ్డి, ఎపి ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ఏటూరి ప్రసాద్, ఎపి షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ ముక్తియార్, మాజీ శాసన మండలి సభ్యులు బీటెక్ రవి, పుట్టా నరసింహ రెడ్డి, నారాయణ రెడ్డి, మాజీ శాసన సభ్యులులింగా రెడ్డి, బి హరి ప్రసాద్ జాతీయ టిడిపి వైస్ ప్రెసిడెంట్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గోవర్ధన్ రెడ్డి, జోనల్ టిడిపి ఇంఛార్జి శ్రీ రెడ్డెప్ప గారి శ్రీనివాసుల రెడ్డి, కార్యకర్తలు, నాయకులు తదితరులు ఉన్నారు.

## విద్యతోనే గిరిజనుల అభివృద్ధి

### - ఎంపిడిఓ మేరీ



**కొత్తపల్లి - నంది పత్రిక :** విద్యతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని శివపురం గ్రామ పంచాయతీ పరిధిలోని శివపూరం గూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల హాజరు, పాఠశాల పరిసరాలు, వంటశాలలను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో సుమారు 500 మొక్కలు నాటి ప్లాంటేషన్ చేసేందుకు తీసిన గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి సమస్యున్న అధికారులకు, ఉపాధ్యాయులకు తెలపాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన ఉపాధ్యాయులు చేయాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత దిశ కృషి చేయాలన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# మైలవరం నియోజకవర్గంలో రూ.190 కోట్లతో అభివృద్ధి పనులు.





## ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పైడూరుపాడులో కమ్యూనిటీ హాల్ ప్రారంభం.

**ఎన్టీఆర్ జిల్లా, (విజయవాడ) రూరల్, బ్యూరో చీఫ్ జూలై 14 నంది పత్రిక** మైలవరం నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు-భవనాలు, ఇరిగేషన్, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల ద్వారా రూ.190 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడులో రూ.25 లక్షల డి.ఎం.ఎఫ్ నిధులతో నిర్మించిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు మంగళవారం ప్రారంభించారు. తాగునీటి సమస్య నివారణకు రూ.4.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన పైపులైన్ పనులను ప్రారంభించారు. రూ.13లక్షల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద పల్లెపండుగ-1, పల్లెపండుగ-2తో పాటు అదనపు పనులు కలిపి 277 పనులకు రూ.42.49 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. వీటితో 57.13 కి.మీ. సీసీ రోడ్లు నిర్మించగా, మరో 2 కి.మీ. బీటీ రోడ్ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఏపీఆర్ఆర్ఎస్పీ కింద 8 రహదారుల అభివృద్ధికి రూ.11.44 కోట్లు మంజూరై టెండర్ల దశలో ఉన్నాయని, మరో రెండు రహదారులను రూ.3 కోట్లతో పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందులో మర్సుమిల్లి తండా రహదారికి రూ.1.68 కోట్లు, కుంటముక్కల రహదారికి రూ.1.32 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద కొత్తరెడ్డిగూడెంకునపరాజుపర్వ మార్గంలో రూ.3 కోట్లతో రెండు వంతెనలు నిర్మిస్తున్నామన్నారు. అలాగే 29 గ్రామ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.9.35 కోట్లు మంజూరై పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. డీఎంఎఫ్ నిధులతో 29 పనులకు రూ.7.32 కోట్లు వెచ్చిస్తుండగా, మరో 50 పనులకు రూ.13 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

రోడ్లు-భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.26.59 కోట్లతో పలు రహదారుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. నూజివీడుమైలవరం రహదారికి రూ.14.89 కోట్లు, విజయవాడవిస్సన్నపేట రహదారికి రూ.8.90 కోట్లు, గడ్డమనుగు బైపాస్కు రూ.80 లక్షలు, ఇతర రహదారుల మరమ్మతులకు రూ.2 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఇబ్రహీంపట్నంఏ.కొండూరు రహదారిలో 5.22 కి.మీ. అభివృద్ధి పనులకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఇరిగేషన్ శాఖ ద్వారా 41 వరద మరమ్మతుల పనులకు రూ.32.91 కోట్లు, 27 నిర్వహణ పనులకు రూ.1 కోటి వ్యయంతో పనులు జరుగుతున్నాయని, 2026-27 సంవత్సరానికి కాలువల నిర్వహణ కోసం 40 పనులకు రూ.3.55 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ ద్వారా 191 పనులకు రూ.67.17 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు తెలిపారు. జల్ జీవన్ మిషన్, జిల్లా మైనింగ్ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ట్రైబల్ సబ్ప్లాన్ తదితర పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) , కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.







## శ్రీ చౌడేశ్వరి మాత అమ్మవారిని దర్శించుకున్న డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు

వెంకటేశ్వర స్వామి, - శ్రీ చౌడేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

శాలువా, పూల మాలలతో సన్మానం చేసిన ఆలయ ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య







**అనంతపురం బ్యూరో చీఫ్ జూలై 14 నంది పత్రిక** అమ్మలను కన్న అమ్మ శ్రీ చౌడేశ్వరి మాతను దర్శించుకున్న పెనుకొండ నియోజకవర్గ పరిసీలుకులు గోగిశెట్టి నరసింహారావు , మంగళవారం ఆయన సోమందేపల్లి లోని వెంకటేశ్వర స్వామిఆలయం, తోగట వీర క్షత్రీయులా ఆరాధ్యదైవం శ్రీ చౌడేశ్వరి అమ్మవారిని ఆలయ ధర్మకర్త, మాస్టర్ వీవర్, సీనియర్ రాజకీయ నాయకులు డీసీ ఈశ్వరయ్య, రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, తహసీల్దార్ మారుతీ తో కలిసి రెండు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు, చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి , గోగిశెట్టి నరసింహారావును దీవించారు, అనంతరం ఆలయ ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య నరసింహారావు, రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, తహసీల్దార్ మారుతి లను శాలువా కప్పి పూల మాలలు వేసి సన్మానం చేసారు, ఈ కార్యక్రమంలో డీసీ లోకేష్, జ్యోతి సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, గట్టు మహేంద్ర, అశ్వర్థ, జేసీబీ కొత్తపల్లి రంగా, రంగన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా చండీహోమం

అమావాస్య వేళ మావుళ్లమ్మ ఆలయంలో..!

హోమంలో పాల్గొన్న 90 మంది దంపతులు

అమ్మవారిని దర్శించుకున్న ఘట్టమనేని జయకృష్ణ



**భీమవరం బ్యూరో చీఫ్ జూలై 14 నంది పత్రిక** భీమవరంలోని మావుళ్లమ్మ దేవస్థానంలో అమావాస్య సందర్భంగా...చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ హోమంలో 90 మంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సూపర్ స్టార్ కృష్ణ మనవడు ప్రత్యేక పూజలు :** ఈ సందర్భంగా సినీ నటుడు, స్వర్గీయ సూపర్ స్టార్ కృష్ణ మనవడు ఘట్టమనేని జయకృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ వేదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, దేవస్థాన చైర్మన్ బొండాడ నాగభూషణం, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అబద్ధాల పునాదులపై పుట్టిందే గొడ్డలి పార్టీ

- మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు
- వైసీపీ హయాంలో 277 మంది మత్స్యకారులు మృతిచెందినా ఒక్కరిని కూడా పరామర్శించలేదు
- రూ.10 లక్షల సాయాన్ని 'ముష్టి' అనడం జగన్ అవినీతి మనస్తత్వానికి నిదర్శనం
- 10 నాటికల్ మైల్స్‌ను 10 కిలోమీటర్లుగా చెప్పడం జగన్ అజ్ఞానానికి ప్రతీక
- అభివృద్ధిపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధం : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, బ్యూరో చీఫ్ జూలై 14: నంది పత్రిక** అబద్ధాలు, అసత్య ప్రచారంతో రాజకీయాలు చేసే పార్టీ వైసీపీ అని, అలాంటి పార్టీ అధ్యక్షుడు జగన్‌రెడ్డికి మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ పర్యటనను జగన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నారని విమర్శించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన జగన్‌రెడ్డి మరోసారి నిరాశపరిచారని పేర్కొన్నారు. విశాఖ సముద్రంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా ఆరుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటన బాధాకరమని మంత్రి తెలిపారు. అయితే సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సహాయక చర్యలు ప్రారంభించిందన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేశాయని వివరించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి బైక్ ఢీకొని గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని అన్నారు. విశాఖ తీరంలో ప్రమాదం జరిగిన ప్రదేశం 10 నాటికల్ మైల్స్ దూరంలో ఉండగా, దానిని 10 కిలోమీటర్లలోపే జరిగిందని జగన్‌రెడ్డి చెప్పడం ఆయనకు ప్రాథమిక అవగాహన కూడా లేదనే విషయాన్ని బయటపెడుతోందన్నారు. నాటికల్ మైల్స్, కిలోమీటర్ల మధ్య తేడా తెలియకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా సముద్రంలో వేటకు వెళ్లిన 277 మంది మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయినా, అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒక్క కుటుంబాన్ని కూడా పరామర్శించలేదని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు మత్స్యకారులపై ప్రేమ చూపించడం రాజకీయ నాటకమేనని విమర్శించారు. విశాఖ ఘటనలో బాధితుల ఆచూకీపై స్పష్టత రాకముందే కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించిన ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించిందన్నారు. ఆ సహాయాన్ని కూడా 'ముష్టి'గా అభివర్ణించడం ప్రజల బాధలను అవమానించడమేనని పేర్కొన్నారు. ప్రతి మత్స్యకార పడవకు ట్రాన్స్‌పాండర్లు అమర్చి, అత్యవసర పరిస్థితుల్లో అలారం బటన్ నొక్కగానే ప్రభుత్వానికి సమాచారం చేరే విధంగా ఆధునిక వ్యవస్థను అమలు చేశామని మంత్రి తెలిపారు. ప్రమాదం జరిగే సమయంలో పడవలో ఉన్న వ్యక్తులు ట్రాన్స్‌పాండర్ స్విచ్ నొక్కకపోవడం వలన ఆచూకి లభించలేదని తెలిపారు. ఘటన జరిగిన రోజు తనకు కంటి శస్త్రచికిత్స జరగటంతో స్వయంగా వెళ్లలేకపోయినా, వెంటనే మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను పంపించి పరిస్థితిని పర్యవేక్షించామని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో మత్స్యకార భరోసా పథకం కింద రూ.531 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.511 కోట్లు మత్స్యకారులకు అందచేసామని వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించడంతో పాటు కొత్త బోట్లు, వలలు, తెప్పల పంపిణీ కార్యక్రమాలను పునఃప్రారంభించామని వెల్లడించారు. మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన రోడ్డు ప్రమాదం కేసులో వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం జరిగినప్పటికీ, సీసీ కెమెరా దృశ్యాలతో నిజాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ప్రమాదాలు ఆకశ్మాత్తుగా జరుగుతాయి, కానీ ప్రమాదం జరిగిన వెంటనే బాధితున్ని వెంటనే హస్పిటల్ కు తరలించకుండా, తన కొడుకును కాపాడుకునేందుకు వేరే వ్యక్తి యాక్సిడెంట్ చేసేనట్లు చిత్రికరించేందుకు ప్రయత్నం చేసిన మాజీ మంత్రి కుటీల మనస్తత్వం ఏంటో బయటపడిందని అన్నారు. సమయానికి బాధితున్ని హస్పిటల్ కు తరలించి ఉంటే అతను బ్రతికే అవకాశం ఉండేదని, చట్టం ముందు ఎవరూ అతీతులు కాదని, ఈ వ్యవహారంలోనూ న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిపై జగన్‌రెడ్డితో ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రి సవాల్ విసిరారు. ప్రత్యక్షంగా అయినా, ఆన్‌లైన్‌లో అయినా ప్రజల ముందే వాస్తవాలు వెల్లడించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. అసత్య ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఇక ఫలించవని, ప్రజలు ఇప్పటికే వైసీపీ నిజస్వరూపాన్ని గుర్తించారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.




## ఎవరెస్ట్‌పై సముద్ర జీవులు.. హిమాలయాల పుట్టుకకు అద్భుత సాక్ష్యం!

అత్యంత ఎత్తైన పర్వత శిఖరం మౌంట్ ఎవరెస్ట్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కానీ, ఆ శిఖరం ఒకప్పుడు సముద్ర గర్భంలో ఉండేదంటే నమ్మగలరా? ఇది అక్షరాలా నిజం. దీనికి తిరుగులేని సాక్ష్యాలు ఎవరెస్ట్ శిఖరాగ్రం వద్దే లభించాయి. ఎవరెస్ట్‌పై ఉన్న సున్నపురాయి పొరల్లో కోట్ల సంవత్సరాల క్రితం జీవించిన సముద్ర జీవుల శిలాజాలు ఉండటమే ఇందుకు నిదర్శనం. భూగర్భ శాస్త్రవేత్తల అధ్యయనాల ప్రకారం, ఎవరెస్ట్ శిఖరాగ్రంలోని సున్నపురాయిలో 45 కోట్ల సంవత్సరాల క్రితం నాటి సముద్ర జీవుల శిలాజాలు భద్రంగా ఉన్నాయి. ట్రైలోబైట్లు, క్రినాయిడ్లు (సముద్ర లిల్లీలు), ఆస్ట్రాకాడ్‌ల వంటి పురాతన జీవుల అవశేషాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. 8,848 మీటర్ల ఎత్తున్న శిఖరానికి కేవలం ఆరు మీటర్ల దిగువన కూడా ఈ శిలాజాలు కనిపించడం విశేషం. ఇది భూమి యొక్క భౌగోళిక చరిత్రలోని ఓ అద్భుతమైన ఘట్టాన్ని మన కళ్ల ముందు ఉంచుతోంది. కోట్లాది సంవత్సరాల క్రితం, ప్రస్తుతం హిమాలయాలు ఉన్న ప్రాంతం 'టెథిస్' అనే మహాసముద్రంలో భాగంగా ఉండేది. ఆ సముద్ర గర్భంలో అవక్షేపాలు, సముద్ర జీవుల అవశేషాలు పేరుకుపోయి కాలక్రమేణా సున్నపురాయి పొరలుగా ఏర్పడ్డాయి. సుమారు 5 కోట్ల సంవత్సరాల క్రితం, భారత, యురేషియా టెక్టోనిక్ ఫలకాలు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ తీవ్రమైన ఘర్షణ ఫలితంగా సముద్ర గర్భంలోని శిలా పొరలు నెమ్మదిగా పైకి నెట్టబడ్డాయి. అలా కొన్ని కోట్ల సంవత్సరాల ప్రక్రియలో హిమాలయ పర్వతాలు, వాటిలో ఎత్తైన ఎవరెస్ట్ శిఖరం ఆవిర్భవించాయి. అయితే ఇది కొత్తగా వెలుగులోకి వచ్చిన విషయం కాదు. దశాబ్దాలుగా భూగర్భ శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనల్లో ఈ వాస్తవాలు ఎప్పుడో రుజువయ్యాయి. ఎవరెస్ట్ శిఖరం అగ్నిపర్వత శిలలతో కాకుండా, సముద్ర గర్భంలోని అవక్షేప శిలలతో ఏర్పడిందని అనేక అధ్యయనాలు నిర్ధారించాయి. భూమిపై అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఒకప్పుడు సముద్రం ఉండేదనడానికి ఈ శిలాజాలు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. టెక్టోనిక్ శక్తులు భూ స్వరూపాన్ని ఎంతగా మార్చగలవో చెప్పడానికి ఎవరెస్ట్ శిఖరం ఒక అద్భుతమైన ఉదాహరణ.



# జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జులై 24వ తేదీ వరకు పొడిగింపు.



## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**భీమవరం బ్యూరో చీఫ్ జూలై 14 నంది పత్రిక** జిల్లాలో డిజిటలైజేషన్ పోర్టల్ లో నోలింగ్ కేజీ ఆప్షన్ లో వున్న ఓటర్లను గుర్తించి వారి సమాచారాన్ని ఎన్యుమరేషన్ ప్రక్రియ ద్వారా డిజిటలైజేషన్ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలోని రెవెన్యూ, రీ సర్వే, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ, 22ఎ ప్రక్రియ పై వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో నుండి మంగళవారం రెవెన్యూ రెవిన్యూ డివిజనల్ అధికారు లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, తహసిల్దార్లు, మండల సర్వేయర్లు తో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడు తూ జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జులై 24వ తేదీ వరకు పొడిగింపు చేస్తున్నట్లు భారత ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. జిల్లాలో సర్ ప్రక్రియ నూరు శాతంపూర్తి ఐనప్పటికీ, నో లింకేజీ ఆప్షన్ లో ఉన్న ఓటర్ల సమాచారాన్ని కూడా సేకరించి డిజిట లైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సమయం వున్నందున జిల్లాలో ఒక లక్ష550 మంది ఓటర్లు నో లింగ్ కేజీ ఆప్షన్ లో వున్నార న్నారు. వీరిని కూడా గుర్తించి డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని అధికారు లకు సూచించారు. ప్రతిరోజు "సర్ " ప్రక్రియకు కొంత సమయం అధికారు లు కేటాయించాలని సూచించారు. సర్ ప్రక్రియ ను జులై 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు పొడిగించడం ఓటర్లకు మంచి అవకాశం అని, ఇంకనూ నమోదు చేసుకొని ఓటర్లు ఎవరైనా ఉంటే అవకాశాన్ని సద్వి నియోగం చేసు కోవాలని అన్నారు. 22ఎ లో పెండింగ్ లో ఉన్న భూములకు సంబంధించి కేసులను రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిష్క రించాలని అన్నారు. పరిష్కరించదగ్గ అన్ని భూసమస్యలను సంబంధిత అధికారు లు పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. పరిష్కారం కానీ కేసులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లటం జరుగుతుందని అన్నారు. తదుపరి సమావేశం నాటికి కేసుల పరిష్కార వివరాలను తమకు సమర్పించాలని అన్నారు. జిల్లాలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలుజారీ ప్రక్రియ మరింత పారదర్శకం గా, వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల తయారీలో తప్పని సరిగా రెవెన్యూ రికార్డులను పూర్తిగా క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత మాత్రమే పుస్తకాలు ముద్రించా లని అన్నారు. ఇంకను ఇకేవైసీ ప్రక్రియ పూర్తి చేయవలసిన రైతులకు వెంటనే తెలియజేసి త్వరిత గతిన పూర్తి చేయాల ని అన్నారు. సెప్టెంబర్ మాసంలో పంపిణీ చేయవలసిన పట్టాదారు పాసు పుస్తకాలు సంబంధిత మండలాల, గ్రామాలు వారిగా రికార్డులను తనిఖీ చేసుకొని పంపిణీకి సిద్ధంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. జనవరిలో జారీ చేయగా మిగిలి న పట్టాదారు పాసు పుస్తకాలు కూడా తదుపరి విడతలో పంపిణీకి సిద్ధంగా ఉంచాలని అన్నారు. జిల్లాలో రీ సర్వే ప్రక్రియలో నాలుగు విడతలలో అన్ని గ్రామాలలో వివిధ స్థాయిలలో పెండింగ్ లో ఉన్న వాటి ప్రగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి విడతలో పంపిణీ చేయవలసిన పట్టాదారు పాసు పుస్తకాలు పూర్తిస్థాయి లో సిద్ధం చేసుకోవల సినదిగా మండల రెవెన్యూ అధికారు లకు తెలియజేశారు. రెవిన్యూ సమస్యలకు సంబంధించి పి జి ఆర్ ఎస్ లో దరఖాస్తు చేసుకున్న అన్ని అర్జీలను పూర్తిస్థాయి లో పరిష్కరించాలని అన్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ, ఇన్ కం సర్టిఫికెట్ల జారీలో జాప్యం ఉండ కూడదని అన్నారు. సాధ్యమైనంత త్వరగా వీటిని పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ రెవెన్యూ సేవలను వేగవంతం చేయడం, భూముల రీసర్వే ప్రక్రియను నిరంతరం పర్య వేక్షించాలని అన్నారు. జిల్లాను అన్ని రంగాలలోనూ అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని, అందుకు సంబంధిత అధికారు లు సమన్వయంతో, పూర్తి పారదర్శకతతో పనిచేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ కె. ఆర్. కల్పశ్రీ, జిల్లా ఇన్చార్జి రెవెన్యూ డివిజన్ అధికారి పి. ప్రభాకర్, ఏడి రీ సర్వే కె. జాషువా, జిల్లాలోని ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో ప్రత్యేక విస్తృత పునశ్చరణ (ఎస్ ఐ ఆర్) సంతృప్తిగా కరంగా జరిగింది


### జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ



**ఏలూరు, బ్యూరో చీప్ జూలై 14 నంది పత్రిక** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐర్) -2026, కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ కోరారు. మంగళవారం జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్)-2026పై సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు అడిగిన ప్రశ్నలకు, సందేహాలకు జిల్లా జాయింటు కలెక్టరు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వేని విజయవంతంగా నిర్వహించారన్నారు. ఏలూరు జిల్లాలో ప్రత్యేక విస్తృత పునశ్చరణ( ఎస్ ఐ ఆర్)-2026 సంతృప్తి కరంగా జరిగి, మొదటి స్థానంలో నిలిచామన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో 16,44,193 మంది ఓటర్లను పర్యవేక్షించేందుకు 1,744 మంది బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ ) ఉన్నారని అన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో గణన పత్రాల( ఈఎఫ్ ల) పంపిణీ 100% పూర్తయిందని, మొత్తం 15,54,463 గణన పత్రాలు డిజిటలైజ్ చేయబడ్డాయని తెలిపారు. దీనితో మొత్తం 94.54% ఈఎఫ్ డిజిటలైజేషన్ సాధించబడిది అని అన్నారు. నియోజకవర్గాలు వారీగా ఎఫ్ ఈ ఎఫ్ డిజిటలీకరణ ఈ క్రింది విధంగా ఉందని తెలిపారు. నం. 63 దెందులూరు: 95.64%,నం. 64 ఉంగుటూరు: 95.36%, నం. 65 ఏలూరు: 95.18%, నం. 70 నూజవీడు: 95.00%,చీశీ. 67 పోలవరం: 93.87%, చీశీ. 68 చింతలపూడి : 93.70%, నం. 73 కైకలూరు: 93.22% పూర్తి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఇంచార్చి జిల్లా రెవెన్యూ అధికారి యల్.దేవకీదేవి, పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వి.వి.యస్.శర్మ, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు పి.వి.వి.యస్.ప్రసాదు టిడిపి, నెరుసు నెలరాజ బిజెపి, ఏ.రతన్ కాంత్ బిఎస్పీ, ఆర్.లింగరాజు, కె.శ్రీనివాసు సిపిఐ(యం), ఎల్.వి.సుభాష్, వి.స్టాన్లీబాబు, వైఎస్ఆర్సిపి, ఆర్.రామమోహన రావు ఐయన్ సి, తదితర ప్రతినిధులు, జిల్లా కలెక్టరేటు సూపర్డెంట్లు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కాపు ఉద్యమనేత ముద్రగడ కన్నుమూత

**విజయవాడ బ్యూరో చీప్ జూలై 14 నంది పత్రిక**కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కన్నుమూశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు, ఆయన మృతితో కుటుంబ సభ్యులతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది.1953లో తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించిన ముద్రగడ పద్మనాభం 1978లో జనతా పార్టీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై 1989 వరకు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. చెన్నారెడ్డి ,ఎన్టీఆర్ ప్రభుత్వాలలో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. కాపు రిజర్వేషన్ల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ముద్రగడ, తన ఉద్యమాలతో రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. 2024 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన మరణ వార్తతో పలువురు రాజకీయ నాయకులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



# కడప పారిశ్రామిక ప్రగతికి మరో మైలురాయి..!





## రూ.3,478 కోట్ల పెట్టుబడితో దాల్మియా సిమెంట్ లైన్2 విస్తరణ... నేడు (15న) రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన

**కడప, బ్యూరో చీఫ్ జూలై 14 నంది పత్రిక** వైఎస్సార్ కడప జిల్లాను ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా.. పారిశ్రామిక రంగంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. దేశంలోని ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థలలో ఒకటైన దాల్మియా సిమెంట్ (భారత్) లిమిటెడ్ చేపడుతున్న లైన్2 విస్తరణ ప్రాజెక్టుకు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు. జమ్మలమడుగు సమీపంలోని మైలవరం మండలం చిన్నకొమర్లలోని దాల్మియా సిమెంట్ ప్లాంట్‌లో ఈ కార్యక్రమం జరగనుంది.

కడప జిల్లాను పారిశ్రామిక కేంద్రంగా ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా తీర్చిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషీ ఫలితంగా.. జిల్లాలో యువత, పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల కుటుంబాల్లో వెలుగులు నిండనున్నాయి. పరిశ్రమల కారిడార్ గా ఎదుగుతున్న కడప జిల్లాలో వేల సంఖ్యలో చిన్న, కుటీర పరిశ్రమలతో పాటు.. అనేక భారీ పరిశ్రమలు దేశ ఆర్థిక వృద్ధిరేటులో కీలకమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. జిల్లాలో సిమెంట్ పరిశ్రమ బలంగా ఎదుగుతోందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం 16 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో పెద్ద సిమెంట్ యూనిట్లు పనిచేస్తుండగా, మరిన్ని విస్తరణ ప్రాజెక్టులు ప్రతిపాదిత దశలో ఉన్నాయి. ఈ విజయ పరంపరలో జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్న దాల్మియా సిమెంట్ కర్మాగార యూనిట్‌కు రెట్టింపు ఉత్పత్తి సామర్థ్యంతో రెండో భారీ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టనుంది. ఈ బృహత్తర శుభకార్యానికి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ శుభారంభం చేయనున్నారు.రూ.3,478 కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టు పూర్తయితే సంస్థ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 12.6 మిలియన్ టన్నులకు పెరగనుంది. ఈ విస్తరణతో 354 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించగా, మొత్తం ప్రత్యక్ష ఉద్యోగాల సంఖ్య 954కు చేరుకోనుంది. ఈ ప్రాజెక్టుకు ఇటీవలే కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నుంచి పర్యావరణ అనుమతి, అలాగే ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి స్థాపన అనుమతి (సీటీఈ) లభించడంతో నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది. కాగా దాల్మియా సిమెంట్స్ విస్తరణతో కడప జిల్లాలో పారిశ్రామిక వాతావరణం మరింత బలోపేతం కానుంది. ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు రవాణా, నిర్మాణం, గనుల తవ్వకం, యంత్రాల నిర్వహణ, సేవారంగం, చిన్నతరహా పరిశ్రమల్లో వేలాది మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. స్థానిక యువతకు ఉపాధి, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతం, కొత్త పెట్టుబడులకు ప్రోత్సాహం లభించే ఈ ప్రాజెక్టు కడప పారిశ్రామికాభివృద్ధిలో మరో కీలక అధ్యాయంగా నిలవనుందని పారిశ్రామిక వర్గాలు, ఉద్యోగార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## రైతుల అవసరాల మేరకు ఎరువులు అందిస్తున్నాం

**జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదు, రైతుల అవసరాల మేరకు ఎరువుల నిల్వలు ఉన్నాయి**

**ఏపిఏఐఎంఎస్ యాప్ పై ప్రతీ రైతుకు అవగాహన కలిగించాలి**

**జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో ఎరువుల సరఫరాపై అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం**

**ఏలూరు, బ్యూరో చీఫ్ జూలై ,14 నంది పత్రిక:** జిల్లాలో రైతుల అవసరాల మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో ఎరువుల సరఫరాపై కలెక్టర్ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, రైతుల అవసరాల మేరకు ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు. భారత ప్రభుత్వ వ్యవసాయ శాఖ మరియు ఎరువుల శాఖ సంయుక్తంగా రూపొందించిన (నేషనల్ ఫెర్టిలైజర్ ఫ్రేమ్‌వర్క నేషనల్ ఫర్టిలైజర్స్ ఫార్మర్స్ ఫారం వర్క్ ఎన్ ఎఫ్ ఎఫ్) మార్గదర్శకాల మేరకు ఖరీఫ్2026 సీజన్‌లో సబ్సిడీ యూరియా మరియు డీఏపీ ఎరువుల పంపిణీని ఏ పి ఏ ఐ ఎం ఎస్ (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ మేనేజ్మెంట్ సిస్టం) మొబైల్ అప్లికేషన్ ద్వారా డిజిటల్ విధానంలో అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఏపిఏఐఎంఎస్ యాప్ పై ప్రతీ రైతుకు అవగాహన కలిగించి వినియోగించేలా వ్యవసాయ శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్2026 సీజన్‌లో ఎరువుల పంపిణీని పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించేందుకు రైతులు తమ భూమి, పంట మరియు సాగుదారు వివరాలను ముందుగానే నవీకరించుకునేలా, ఎరువుల విక్రేతలు ఏ పి ఏ ఐ ఎం ఎస్ మరియు ఐ ఎఫ్ ఎం ఎస్ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ డిజిటల్ విధానం ద్వారా నిజమైన సాగుదారులకు ఎరువులు సకాలంలో అందడంతో పాటు డిమాండ్ అంచనా, సరఫరా గొలుసు నిర్వహణ మరియు ప్రభుత్వ ప్రణాళికల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారుఏలూరు జిల్లాలో జూన్ 8, 2026 నుండి పి ఏ ఐ ఎం ఎస్ మొబైల్ అప్లికేషన్ ద్వారా యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. కొత్త డిజిటల్ విధానానికి రైతులు, ఎరువుల విక్రేతల నుంచి మంచి స్పందన లభిస్తున్నదన్నారు. జూన్ 8 నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఏ పి ఏ ఐ ఎం ఎస్ ద్వారా మొత్తం 4,290 మెట్రిక్ టన్నుల యూరియా మరియు 1,069 మెట్రిక్ టన్నుల డీఏపీ విక్రయాలు నమోదయ్యాయని వెల్లడించారు. ఈ విధానం ద్వారా రైతుల భూమి, సాగు పంటలు మరియు అర్హత వివరాల ఆధారంగా అవసరమైన ఎరువులను పారదర్శకంగా, సమర్థవంతంగా పంపిణీ చేయడంతో పాటు అనధికార కొనుగోళ్లను నివారించడం, నిజమైన సాగుదారులకు సకాలంలో ఎరువులు అందించడం, ఎరువుల దుకాణాల వద్ద రద్దీని తగ్గించడం మరియు సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

ఖరీఫ్2025 వ-్రాఖుత్ము వివరాలను ప్రాథమిక డేటాగా తీసుకుని ఖరీఫ్2026 సాగు వివరాలు నవీకరించబడతాయని, రైతులు తమ గ్రామంలోని సంబంధిత రైతు సేవా కేంద్రం ఆర్ ఎస్ కె సంప్రదించి భూ వివరాలు, సాగుదారు, పంట, సాగు విస్తీర్ణం వంటి వివరాలను అవసరమైతే తప్పనిసరిగా సరిచేయించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త సాగుదారులు లేదా మార్పులు అవసరమైన రైతులు ఆధార్, మొబైల్ నంబర్ ఆధారంగా ఓటిపి ధృవీకరణ అనంతరం తమ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. . ఇప్పటికే ఎరువులు కొనుగోలు చేసినట్లయితే మిగిలిన అర్హత మేరకే ఎరువులు పొందగలరన్నారు. ఎరువుల విక్రయ విధానం: చెల్లుబాటు అయ్యే ఎరువుల లైసెన్స్ కలిగిన ప్రైవేట్ రిటైలర్లు, పిఏసిఎస్ మరియు రైతు సేవా కేంద్రాలు (ఆర్ ఎస్ కె ఎస్) మాత్రమే పీ ఏ ఐ ఎం ఎస్ ద్వారా యూరియా మరియు డీఏపీ ఎరువులను విక్రయిస్తాయన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఆధార్ సంఖ్య నమోదు చేయాలని, ఓటిపి ద్వారా ధృవీకరణ పూర్తి చేయాలని, భూమి, పంట మరియు ఎరువుల అర్హత వివరాలను పరిశీలించాలని, అర్హత మేరకే యూరియా లేదా డీఏపీ ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. ఏ పీ ఏ ఐ ఎం ఎస్ లో నమోదైన ప్రతి విక్రయం ఐఎఫ్ఎమ్ఎస్ ఆధారిత పి ఓ ఎస్ యంత్రంలో అదే ఆధార్ సంఖ్యతో పూర్తిచేయడం తప్పనిసరని, . రెండు వ్యవస్థల వివరాలు పరస్పరం సరిపోల్చబడతాయని, వ్యత్యాసాలు గుర్తించినట్లయితే సంబంధిత వారిపై చర్యలు తీసుకోబడతాయన్నారు. యూరియా మొత్తం అర్హత మూడు బస్తాలు లేదా అంతకంటే తక్కువగా ఉంటే రైతులు ఒకేసారి లేదా విడతల వారీగా కొనుగోలు చేయవచ్చన్నారు. మూడు బస్తాలకు మించిన అర్హత ఉన్న రైతులకు మూడు విడతల్లో సరఫరా చేయబడుతుందని, . ప్రతి విడతలో మొత్తం అర్హతలో మూడవ వంతు లేదా మూడు బస్తాలు, ఏది ఎక్కువైతే అది అందజేయబడుతుందన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి మరియు మిరప ప్రధాన పంటలకు ఎకరానికి ఒక బస్తా (50 కిలోలు) డీఏపీ ఎరువుకు అర్హత ఉంటుందని, ఒక్క లావాదేవీలో గరిష్టంగా పది బస్తాల వరకు మాత్రమే డీఏపీ కొనుగోలు చేయవచ్చన్నారు.

రైతులు ఎక్కువగా వినియోగించే ఎరువుల దుకాణాలను సంబంధిత రైతు సేవా కేంద్రాలకు అనుసంధానం చేయడం జరిగినదని, . అవసరమైతే ఒకే ఎరువుల దుకాణాన్ని ఒకటి కంటే ఎక్కువ రైతు సేవా కేంద్రాలకు అనుసంధానం చేసే అవకాశం ఉందన్నారు. .

ప్రత్యేక భూములు మరియు సంస్థల నమోదు:వ-్రాఖుత్ము లో లేని భూములు, సంస్థల భూములు మరియు ఇతర ప్రత్యేక భూముల వివరాలను సంబంధిత మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) ద్వారా నమోదు చేయవచ్చన్నారు. నమోదు చేసిన వివరాల ఖచ్చితత్వానికి సంబంధిత మండల వ్యవసాయ అధికారి బాధ్యత వహిస్తారన్నారు. ఎరువుల విక్రయాలను వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని, దుకాణాల వారీగా విక్రయాలు, రైతుల వారీ లావాదేవీలు మరియు కాలవ్యవధి వారీ యూరియా, డీఏపీ విక్రయాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించబడతాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎరువుల దుకాణాలపై సస్పెన్షన్‌తో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ హెచ్చరించారు. ఏ పీ ఏ ఐ ఎం ఎస్ సంబంధిత సాంకేతిక సమస్యలు, నమోదు మరియు విక్రయ ప్రక్రియలపై సహాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయబడిందని,. జిల్లా స్థాయిలో కూడా సహాయ కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించబడుతుందన్నారు.



# ఉప ముఖ్యమంత్రి, మంత్రుల జిల్లా పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్







ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లాలోని సీతమ్మసాగర్, సీతారామ ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) ప్రాజెక్టులను పరిశీలించడంతో పాటు నిర్వహించనున్న సమీక్ష సమావేశం నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అవసరమైన భద్రతా ప్రమాణాలు, బారికేడింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, రాకపోకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అమ్మగారిపల్లి వద్ద నిర్వహించనున్న సమీక్ష సమావేశం ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. సమావేశ వేదిక, అధికారుల, ప్రజాప్రతినిధుల కూర్చునే ఏర్పాట్లు, మీడియా ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు సంబంధిత అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన, సమీక్ష సమావేశం విజయవంతంగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్, నీటిపారుదల శాఖ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ కులాల అభివృద్ధి సమీక్ష సమావేశంలో సీఎంతో పాల్గొన్న షబ్బీర్ అలీ



హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో భారత షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ చైర్మన్కిషోర్ మక్వానా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ , మంత్రి.అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో అమలవుతున్న షెడ్యూల్డ్ కులాల సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి, గృహ నిర్మాణం, ఆర్థిక సాధికారత, సామాజిక న్యాయం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఎస్సీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల అమలు, పురోగతి, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై అధికారులు వివరించారు. సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎస్సీ వర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం మరింత కట్టుబడి పనిచేస్తుందని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి



కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జులై 15న హైదరాబాద్ లో జరిగే నిరుద్యోగుల మహా ధర్నాకు కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో నిరుద్యోగులతో కలిసి మహా ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని,నెలకు 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. కానీ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు పరచకపోగా, తమ వయో పరిమితి మించిపోతోందని నోటిఫికేషన్లు విడుదల చేయాలని పోరాటం చేస్తున్న నిరుద్యోగుల ఉద్యమాలను అణచివేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తుంటే మాట దాటవేస్తున్నారని విమర్శించారు.ఖాళీల భర్తీకి ఎటువంటి చర్యలు తీసుకోకుండా, అసత్య ప్రకటనలు,మోసపూరిత హామీలతో నిరుద్యోగులను ఇంకా ఎంత కాలం మోసం చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఇల్లు పొలాలు స్థలాలు తాకట్టుపెట్టి సంవత్సరాల తరబడి విలువైన శ్రమను, కాలాన్ని డబ్బును వెచ్చించే నిరుద్యోగులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ లు రాక సంవత్సరాల తరబడి నిరుద్యోగులు గ్రంధాలయాల చుట్టూ తిరుగుతూ లక్షల రూపాయలను పోటీ పరీక్షల కోసం ఖర్చు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 10 లక్షలకు పైగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని, పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేసి భర్తీ చేయాలని, డీఎస్సీ,గ్రూప్1,2,3,4లతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేంతవరకు నిరుద్యోగులు అందరికీ నెలకు 5000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఎలాంటి వివాదాలు, కోర్టు కేసులు లేకుండా వివాదాస్పదమైన జీవోలను తొలగించి పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ను యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులన్నింటినీ తక్షణమే భర్త చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీ న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే నిరుద్యోగుల మహా ధర్నా కు జిల్లాలోని అన్ని మండలాల నుండి యువత హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు వెంకట్ గౌడ్ మూతిరం కొత్త నరసింహులు జిల్లా కమిటీ సభ్యులు బుధవారం అరుణ్ కుమార్,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్‌లు, ఫీజు

## రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల వద్ద బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన ద్వారం ఎదుట నిరసన వ్యక్తం చేసిన ఏబీవీపీ నాయకులు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు రూ.12,000 కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక పలువురు విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ప్రభుత్వ కళాశాలల్లో తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమం శాంతియుతంగా కొనసాగగా, కళాశాల వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఏబీవీపీ నాయకులు తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ నిరసనను ముగించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ మండల కార్యకర్తలు పెద్ది లవన్ రెడ్డి, సూర్యం, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళ సంఘాల్లో లేని మహిళలందరినీ మహిళ సంఘాల్లో చేర్పించాలి



కామారెడ్డిజిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ సర్ శాఖ జిల్లా స్థాయి ఏ పీ ఎం, సిసిల సమీక్ష సమావేశం జిల్లా కలెక్టరేట్లోని సమావేశం హాలు లో నిర్వహించడం జరిగినది. జిల్లా కలెక్టర్ ఇట్టి సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ జూలై మాసం ను సర్ఫ్ సీఈవో ప్రత్యేక మహిళా సంఘం చేకూర్పు మాసంగా ప్రకటించినందున జిల్లా లో సంఘాల్లో లేకుండా మిగిలిపోయిన ప్రతి పేద మహిళను మహిళ సంఘాల్లో చేర్పించాలని ఇది ఏ పీ ఎం, సీసీలు ల బాధ్యత అని ఆదేశించడమైనది. మహిళా సంఘం లో చేరడం వలన పేద మహిళలకు ఆర్థిక చేయుత అందుతుందని తద్వారా వారి జీవనోపాదులకు అవసరమైన రుణాలు సంఘం నుండి తీసుకొని కొని పేదరికం నుంచి వారు బయటకు వచ్చే అవకాశం ఉంటుందని అదేవిధంగా బిఎల్ఆర్ సదుపాయాన్ని కూడా వినియోగించుకోగలుగుతారని తెలిపారు. ప్రతి మహిళ సంఘంలో చేరి తమ అవసరమైన ఆర్థిక సదుపాయాన్ని పొందడం వారి హక్కు అని కలెక్టర్ గారు తెలిపారు. మహిళా సంఘాలతో పాటు వికలాంగుల సంఘాలు మరియు వృద్ధుల సంఘాల పనితీరుపై కూడా సమీక్ష చేస్తూ జిల్లాలో వికలాంగుల సంఘాలు మరియు వృద్ధుల సంఘాల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని సిబ్బంది ఈ విషయమై కష్టపడి పనిచేసి ఈ నెల ఆఖరు వరకు అర్హులైన ప్రతి దివ్యాంగులను మరియు 60 సంవత్సరాలు దాటిన మహిళ వృద్ధులను దివ్యాంగుల సంఘాలు మరియు వృద్ధ మహిళా సంఘాల్లో చేర్పించాలని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినందున సిబ్బంది అందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఎస్ ఎస్ జి మహిళలకు తో పాటు సంఘంలో లేని మహిళలకు కూడా చీరలు ఇవ్వడం జరిగిందని. జిల్లాలో 33102 మందికి ఇవ్వగా అందులో 20619 మందికి మహిళా సంఘాల్లో చేర్పించాలని సర్ లక్ష్యంగా విధించి జులై 31 లోగా ఇట్టి మహిళలందరూ కూడా సంఘాల్లో చేర్పించాలని సీసీలను ఏపీఎంలను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సంఘం మహిళా సంఘం ప్రతినిధుల సహకారం తీసుకొని ప్రతి ఇంటింటికి వెళ్లి అర్హులైన మహిళలను దివ్యాంగులను సంఘాల్లో చేర్పించే కార్యక్రమం అన్ని గ్రామాల్లో చేపట్టాలని జిల్లా కలెక్టర్ గారు ఆదేశిస్తూ విషయమై నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేయడమైనది .కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జిల్లా గ్రామీణ సంస్థ అధికారి, అదరపు డి ఆర్ డి ఓ, డీపీఎంలు ఏపీఎంలు సీసీలు మరియు జిల్లా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శి, కోశాధి కారులు పాల్గొన్నారు.



## ఏఐ ఉపయోగించండి... సైబర్ భద్రత పటిష్ఠం చేయండి:

బ్యాంకింగ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని, సైబర్ భద్రతను పటిష్ఠం చేసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా బ్యాంకులకు పిలుపునిచ్చారు. వినియోగదారులకే పెద్దపీట వేయాలని అన్నారు. మంగళవారం ముంబైలో ప్రభుత్వ రంగ మరియు ఎంపిక చేసిన ప్రైవేట్ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో ఆర్బీఐ నిర్వహించిన అర్ధవార్షిక సమావేశంలో ఆయన ఈ కీలక సూచనలు చేశారు. ఈ సమావేశానికి ఆర్బీఐ గవర్నర్‌తో పాటు డిప్యూటీ గవర్నర్లు స్వామినాథన్ జె., డా. పూనమ్ గుప్తా, ఎస్. సి. ముర్ము, రోహిత్ జైన్‌లతో పాటు పలువురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు హాజరయ్యారు.

# ఇష్టానుసారంగా చెట్లు నరికి వేత



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఇష్టానుసారంగా కొందరు చెట్లను నరికి వేయడం జరుగుతుంది. వర్షం కురవడానికి ప్రధానాధారమైన అటవి సంపద కలప వ్యాపారుల దాహానికి రోజురోజుకు కనుమరుగు అవుతోంది. ఎక్కడ పచ్చని చెట్లు కనిపించినా అక్కడ గబ్బిలంలా వాలి పోయి సంబంధిత రైతులకు ఎంతో కొంత ముట్ట జెప్పి పెద్ద పెద్ద చెట్లను సైతం నరికి కట్టెల మిషన్లకు తరలించి అక్కడి నుండి గంభీరావుపేట మండలం నుంచి ఇతర మండలాలకు తరలిస్తున్నారు. ఎటువంటి అనుమతి పత్రంలు లేకుండా 5 నుంచి 6 లోడ్లు పంపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే కట్టెల మిషన్లు జనవాసాల మధ్యలో ఉండటంతో విపరీతమైన శబ్దంతో పాటు పొట్టు కూడా సమీపంలోని ఇంట్లోకి రావడంతో పెద్దవారితో పాటు చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారని ఇదే విషయమై గతంలో ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అంటున్నారు. పర్యావరణ సమతుల్యత, జీవవైవిద్యం దెబ్బతింటుంది. వాల్టా చట్టం ప్రకారం.. అడవులతో పాటు రైతు పంట పొలాల్లో కూడా చట్టవిరుద్ధంగా చెట్లను నరకకూడదు. కేవలం అటవీశాఖ అనుమతితో అడవి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఎండిపోయిన, బలహీనమైన, తెగుళ్లు సోకిన లేదా అగ్నిప్రమాదాలకు కారణమయ్యే చిన్న చెట్లను మాత్రమే నరకాలి. పర్యావరణ సమతుల్యత కోసం పెద్ద చెట్లను, ఆరోగ్యకరమైన చెట్లను సజీవంగా ఉన్న, అరుదైన మరియు పర్యావరణానికి మేలు చేసే వృక్షాలను నరకడం పూర్తిగా నిషేధం కలప వ్యాపారులు మాత్రం ఎప్పటిలాగే అనుమతులు లేకుండానే వేప,మామిడి





వంటి విలువైన చెట్లను కూడా చెట్లను నరికి వేస్తుండటంతో జీవవైవిద్యం దెబ్బ తినడంతో పాటు వన్యప్రాణులు తమ కోల్పోవడంతో జనావాసాల్లోకి వస్తున్నాయంటూ ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెట్లను నరికి వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

# జగిత్యాలను పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం






జగిత్యాల మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ అధ్యక్షతన జూలై--2026 మాసానికి సంబంధించిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా జగిత్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వార్డుల వారీగా నిర్వహించిన స్వచ్ఛ భారత్ అవగాహన సదస్సులకు దేశ స్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణమని తెలిపారు. పాలకవర్గ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ పార్టీలకు అతీతంగా సమిష్టిగా పనిచేస్తూ జగిత్యాలను పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే జగిత్యాల పట్టణాన్ని ఆనుకుని ఉన్న చెరువులను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అమృత్ (అమృత ) పథకం ద్వారా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకొని, సంబంధిత కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఆయా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా, సర్ ప్రక్రియలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని,ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, జగిత్యాల పట్టణంలో మెరుగైన మౌలిక వసతుల కల్పనతో సమగ్ర అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని తెలిపారు. రూ. 6 కోట్ల 13 లక్షల అంచనా వ్యయంతో జగిత్యాల పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు.జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్ సహకారంతో ఈ నిధులను త్వరితగతిన మంజూరు చేయించి పట్టణంలో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ ఇటీవల మున్సిపల్ కమిషనర్ పేరుతో జరిగినట్లు ఆరోపణలు ఉన్న ఫోర్జరీ ఆధారిత రిజిస్ట్రేషన్ అంశంపై మాట్లాడుతూ, ఈ ఘటనను పాలకవర్గం పూర్తిగా ఖండిస్తోందని తెలిపారు. విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ కమిషనర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని,ఈ కేసు దర్యాప్తులో మున్సిపాలిటీ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని పేర్కొన్నారు.ఈ వ్యవహారంలో మాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ,తప్పుడు ప్రచారాలను ఖండించారు.దర్యాప్తులో బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణంలోని అన్ని వార్డులు, నూతన హౌసింగ్ కాలనీలలో రోడ్లపై గుంతలు పూడ్చడం,వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జేసీబీల ద్వారా డ్రైన్లు,కాలువలను శుభ్రపరచడం, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లను పూర్తిస్థాయిలో ప్రజల వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. అనంతరం జాతీయ జల మిషన్ కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తూ సభ్యులందరూ జల ప్రతిజ్ఞ చేశారు. ప్రతి నీటిని ఒడిసి పట్టి రాష్ట్రంలోనే జగిత్యాలను ఇంకుడు గుంతల నిర్మాణంలో జగిత్యాలను అగ్రగామిగా నిలుపుదామని కమిషనర్ వార్డు సభ్యులందరూ సహకరించాలని కోరారు. వార్డు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించడం జరిగినది. ఈ సమావేశంలో కమిషనర్ సత్య ప్రణవ్,మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు,మున్సిపల్ అధికారులు,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితుల్లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

మండలంలోని రైతులకు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. దమ్మపేట రైతు వేదికలో నిర్వహించిన రైతుల సమావేశంలో వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత వర్షాకాలంలో మండలంలో సుమారు పది వేల ఎకరాల్లో వరి సాగు జరిగిందన్నారు. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు వెయ్యి ఎకరాల లోపే వరి నాట్లు పూర్తయ్యాయని తెలిపారు. దీనికి ప్రధాన కారణం ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదుకావడం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు లేకపోవడం, భూగర్భ జలాల మట్టం తగ్గిపోవడమేనని వివరించారు. ఈ పరిస్థితుల వల్ల వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో కూడా ఇదే తరహా వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే అపరాలు, చిరుధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నష్టాలను నివారించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆత్మ అధ్యక్షుడు సుంకవల్లి వీరభద్ర రావు, వ్యవసాయ విస్తరణ అధికారి అనుబాబు, రైతులు పాల్గొన్నారు.




# నార్సింగి గ్రామంలో 30 కు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



పాపన్నపేట మండలం నార్సింగి గ్రామ ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన చెక్కులను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామానికి ఇప్పటివరకు సుమారు 30కు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరవడం గ్రామ ప్రజలకు ఎంతో ఊరటనిచ్చింది. అనారోగ్యం, ప్రమాదాలు, అత్యవసర వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తక్షణ సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పుంటికూర నారాయణ గౌడ్ మాట్లాడుతూ, నార్సింగి గ్రామం నుంచి అర్హులైన దరఖాస్తులను పరిశీలించి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కావడం సంతోషకరమని అన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజలకు అవసరమైన ప్రతి ప్రభుత్వ పథకం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వై. నర్సింలు, చాకలి నర్సింలు, వార్డు సభ్యుడు శ్రీరామ్ నవీన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు చెక్కులను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, అలాగే సహకరించిన కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకాన్ని అందించేందుకు తమ సేవలు నిరంతరం కొనసాగుతాయని నాయకులు పేర్కొన్నారు.

# నల్గొండ ఎస్.ఈ గా బాధ్యతలు చేపట్టిన అమరబోయిన శ్రీనివాస్



నల్గొండ విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ గా అమరబోయిన శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ బిసి సంఘ రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యుత్ బిసి రాష్ట్ర నాయకులు మారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్.ఈ ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఈ అమరబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యోగులు మరియు సిబ్బంది రైతులకు, వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ అంతరాయాలను తగ్గించాలని అన్నారు. ప్రజలకు, పశువులకు మరియు విద్యుత్ శాఖ కార్మికులకు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ బిసి సంఘ అధ్యక్షుడు, గంజి వెంకన్న, కార్యదర్శి ఊటుకూరి గిరి, లైజాన్ ఆఫీసర్ మధు, ఏ.ఏ.ఓ, కె బిక్షపతి, జే.ఏ.వో, వి రవికుమార్, ఏ.డి.ఈ శంకరయ్య,. జే.ఏ.ఓ హరి ప్రసాద్, జి శ్రీనివాస్, ఏఈ, ఎస్ హరికృష్ణ, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

# రేపటి నుంచి సరికొత్త రైల్వే వెబ్‌సైట్.. ఇక టికెట్ బుకింగ్ మరింత స్పీడ్!

రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) శుభవార్త అందించింది. టికెట్ బుకింగ్ సమయంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలకు స్వస్తి పలుకుతూ, భారీ మార్పులతో సరికొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ అప్‌గ్రేడెడ్ వెబ్‌సైట్ రేపటి (జులై 15) నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com